ఎకరాకు 113 కిలోల వేరుసెనగ దిగుబడి



అక్కంపల్లి గ్రామ పొలంలో వేరుసెనగ కాయలను తూకం పరిశీలిస్తున్న ఏడీఏ రవి, తదితరులు

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: ఖరీఫ్‌లో సాగైన వేరుసెనగ పంట కోత ప్రయోగాలు ఎంపికైన పొలాల్లో జిల్లా అంతటా ప్రారంభమయ్యాయి. శనివారం అనంతపురం గ్రామీణం అక్కంపల్లి గ్రామ పొలంలో ఎంపికైన పొలంలో వేరుసెనగ పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. ప్రయోగాలను అనంతపురం డివిజన్ ఏడీఏ రవి పరిశీలించారు. మహిళా రైతు పుల్లమ్మ పొలంలో మొత్తం 5́5 విస్తీర్ణంలో పంట తొలగించారు. చెట్లలోని కాయలన్నీ తీసి తూకం వేశారు. 1,050 కిలో గ్రాములు దిగుబడి వచ్చింది. అంటే ఎకరాకు 113 కిలోలు (ఒక క్వింటా 13 కిలోలు) దిగుబడి వచ్చిందని ఏడీఏ తెలిపారు. ఖరీఫ్ నుంచి జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. పంట ఎదుగుదల లేక దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. తాజాగా వర్షం లేక పంట ఎండిపోయింది.

జిల్లాకు 1300 మెట్రిక్ టన్నుల ఎరువులు

జిల్లాకు శనివారం రైలు రేకు ద్వారా 1300 మెట్రిక్ టన్నులు వివిధ రకాల ఎరువులు వచ్చాయని అనంతపురం వ్యవసాయ సబ్ డివిజన్ సహాయ సంచాలకులు రవి తెలిపారు. అందులో అమ్మోనియం సల్ఫేట్ 670 మెట్రిక్ టన్నులు, 20-20-013 కాంప్లెక్స్ ఎరువులు 630 మెట్రిక్ టన్నులు వచ్చాయని తెలిపారు.

మాయలో దించుతారు... నట్టేట ముంచుతారు

● సైబర్ నేరగాళ్ల వలలో విలవిల ● యువతా.. తస్మాత్ జాగ్రత్త!




హాయ్.. అని ఆకర్షించి..

ఇటీవల అనంత నగరానికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి వాట్సప్‌కు గుర్తు తెలియని నంబరు నుంచి 'హాయ్' అని మెసేజ్ వచ్చింది. హాలో అని పరిచయం చేసుకున్నాడు. వెంటనే ఓ యువతి ఆకర్షణీయ ఫొటోలను పంపింది. నగ్నంగా చూడాలంటే వీడియోకాల్ చేయమని కోరింది. బలహీన క్షణంలో అతడు వీడియో కాల్ చేయగానే అవతల నగ్నంగా యువతి వీడియోలో కనిపించింది. వెంటనే కాల్‌కట్ అయింది. మూడు నిమిషాలు నగ్నంగా ఉన్న యువతి వీడియోను... ఇవతలి వ్యక్తి చూసినట్లు మార్ఫింగ్ చేసి.. తిరిగి సదరు ఉద్యోగికి వచ్చింది. ఇదే వీడియోను మీ మిత్రులు, కుటుంబ సభ్యులకు పంపుతామని, డబ్బు ఇస్తే ఆపేస్తామని చాట్ చేశారు. భయపడిన బాధితుడు రూ.లక్ష వరకు సైబర్ నేరగాళ్ల పంపిన ఖాతాలకు డబ్బు జమ చేశాడు.

ప్రేమ.. పెళ్లి వరకు వెళ్లి..

గుంతకల్లుకు చెందిన యువతికి ఓ డేటింగ్ యాప్‌లో శాండీ పేరుతో నకిలీ యూజర్ ప్రొఫైల్‌తో ఫ్రెండ్ రిక్వెస్ట్ వచ్చింది. ఓ ప్రముఖ సంస్థలో ఉద్యోగినని, యాప్ డెవలపర్ అని పరిచయం చేసుకున్నాడు. అతడి ప్రొఫైల్ చూసి సదరు యువతి అంగీకరించింది. కొన్ని రోజులపాటు సరదాగా మాట్లాడాడు. తర్వాత ప్రేమిస్తున్నానని, పెండ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఆ నేరగాడిని యువతి పూర్తిగా నమ్మింది. కొన్నిరోజులకు తన కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో ఉన్నారని, డబ్బు అవసరమని, కొంత సర్దితే మళ్లీ పంపిస్తానంటూ నగదు లాగేశాడు. ఇలా రూ.3 లక్షలు దోచుకున్నాడు. చివరకు మెసేజ్‌లు, ఫోన్ చేయడం ఆపేశాడు. యువతి లబోదిబోమంది. పోలీసు కేసు వరకూ వెళ్తే పరువు పోతుందని వెనక్కి తగ్గింది.

ఉమ్మడి జిల్లాలో 2021 నుంచి సైబర్ నేరాలు ఇలా..



అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే

హాయ్.. అని మొదలవుతుంది ఆ యవ్వారం.. వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం.. ఇలా సామాజిక మాధ్యమాల వేదికగా కొత్త స్నేహాలు పుట్టుకొస్తాయి. ఇంకేం.. ముందు మాటలు.. ముద్దుముచ్చట్లతో కాలం సాగుతుంది. మాటల వెనక మర్మం తెలిసేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. స్నేహం మాటున పన్నాగం మొదలై.. నెమ్మదిగా ఉచ్చులోకి దించే తంతు.. మాయలో పడిన యువకులకు వీడియో చాటింగ్ చేస్తారు.. ఆపై నగ్న వీడియోలు.. తర్వాత వాటిని సోషల్ మీడియాలో పెడతామని బెదిరింపులు.. ఇక అంతే దొరికిన కాడికి దోచుకుంటారు. వలలో చిక్కిన వారు తగిన భారీ మూల్యం చెల్లించుకుంటున్నారు.

విద్యార్థుల నుంచి వృద్ధులదాకా..

సామాజిక మాధ్యమాల్లో డేటింగ్ యాప్‌లు విపరీతంగా పెరిగిపోయాయి. అందమైన ఫొటోలను డీపీలుగా ఉంచి ఆకర్షిస్తారు. హాలో.. హాయ్.. అని సందేశాలు పంపడంతోనే మొదలవుతుంది. ఇప్పటివరకు పురుషులు మాత్రమే బాధితులు కాగా.. మహిళలనూ ఈ ఉచ్చులోకి లాగుతున్నారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, డేటింగ్ యాప్స్ ..ఇవే మాయగాళ్లకు అసలైన అస్త్రాలు. స్నేహం పేరుతో రిక్వెస్ట్ పంపుతారు. ప్రొఫైల్‌లో అందమైన చిత్రాలు, ఉన్నత కొలువులో ఉన్నట్లు నమ్మిస్తారు. రిక్వెస్ట్‌కు స్పందించగానే చాటింగ్ చేస్తారు. సామాజిక హోదా, వయసు ధ్రువీకరణ చేసుకుంటున్నారు. అర్ధరాత్రి దాటాక వాట్సప్ ఫోన్‌కాల్ చేసి గంటల తరబడి మాట్లాడుతున్నారు. ట్రాప్‌లో పడ్డట్లు నిర్ధారణకు వచ్చాక నేరప్రణాళికను అమలు చేస్తున్నారు. వాట్సప్‌లో ఫ్రంట్ కెమెరా ద్వారా నగ్న వీడియోకాల్ చేస్తారు.. దృశ్యాలను ఇవతలి వ్యక్తి చూస్తున్నట్లు స్క్రీన్ రికార్డింగ్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఎదురు తిరిగితే బెదిరిస్తున్నారు.

1930 నంబరుకు ఫిర్యాదు చేయండి

సైబర నేరగాళ్ల ఆటకట్టించడానికి సైబర్ క్రైం ఇన్వెస్టిగేషన్ సెల్ నంబరు 1930కు ఫిర్యాదు చేయాలి. బాధితుల పేరు, మెయిల్ చిరునామా, ఇతర వివరాలను ఫిర్యాదులో పేర్కొనాలి. నేరం ఎలా జరిగిందనే అంశాన్ని నమోదు చేయాలి. అత్యవసరమైతే స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలి. అలాగే **'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సైబర్‌క్రైం.జీవోవి.ఇన్'** వెబ్‌సైట్‌లోకి వెళ్లి నేరానికి సంబంధించిన వివరాలను నమోదు చేసి పంపాలి. వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, మెయిల్‌ల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు ఫ్రెండ్ రిక్వెస్టులకు అంగీకారం తెలపకుండా అప్రమత్తం కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అత్యాశ, అవగాహన రాహిత్యంతోనే..

- జగదీశ్, ఎస్పీ, అనంతపురం



మానవ బలహీనతలతోనే సైబర్ నేరాలు ఎక్కువగా జరగడానికి అవకాశం ఉంది. అత్యాశ, అవగాహన రాహిత్యంతో నేరగాళ్లలో వలలో చిక్కుకుంటున్నారు. డబ్బు ఆశను ఆసరాగా చేసుకుని నేరాలు అధికంగా జరుగుతున్నాయి. ఈమధ్య కాలంలో డిజిటల్ అరెస్టు, ఫెడెక్స్ ఉచ్చులో పడి యువత ఎక్కువగా నష్టపోతున్నారు. సామాజిక మాధ్యమాల్లో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫ్రెండ్ రిక్వెస్ట్‌కు స్పందించవద్దు. హనీట్రాప్, డేటింగ్ యాప్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలి. బాధితులు నిర్భయంగా ఫిర్యాదు చేయాలి. వారి వివరాలు గోప్యంగా ఉంచుతారు.



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి

విచారణ వేగవంతమైతేనే బాధితులకు న్యాయం

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి

అనంతపురం (లీగల్), న్యూస్‌టుడే: కేసుల విచారణలో వేగం పెరగాలి. శిక్షలు పడేలా వేగవంతం చేసి, బాధితులకు సకాలంలో న్యాయం జరిగేలా చూడాలని హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి అన్నారు. జిల్లా కోర్టులో శనివారం న్యాయాధికారులకు నూతన చట్టాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. నూతన చట్టాలను పరిగణలోకి తీసుకొని కేసుల విచారణను వేగవంతం చేయాలన్నారు. పోలీసులు కోర్టుకు అందజేయాల్సిన నివేదికలను సకాలంలో పంపేలా ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. అనంతరం హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ శ్యాంసుందర్, రీసోర్స్ పర్సన్ హజరత్‌రావులు నూతన చట్టాలు, పోక్సో చట్టం, గృహహింస చట్టాలపై అవగాహన కల్పించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్, న్యాయమూర్తులు సత్యవాణి, రాజ్యలక్ష్మి, శోభారాణి, హరిత, సాధుబాబు, శివప్రసాద్ యాదవ్, శంకర్‌రావు, శివశంకర్, సుజిన్‌కుమార్, ప్రతిభ పాల్గొన్నారు.

న్యాయవాదులకు అవగాహన ముఖ్యం

జూనియర్ న్యాయవాదులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆయన శనివారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులతో సమావేశమయ్యారు. న్యాయమూర్తి జిల్లాలో ఆయనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేశారు. సొంత ఊరికి వచ్చినంత ఆనందంగా ఉందన్నారు. ఇక్కడే ఎస్కేయూ విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రంలో పట్టభద్రుడై హైకోర్టు నుంచి జిల్లా పరిపాలనా న్యాయమూర్తిగా రావడం ఆనందంగా ఉందన్నారు. జాతీయ బార్ కౌన్సిల్ సభ్యులు రామిరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్ న్యాయవాదులు రఘురామిరెడ్డి, నారాయణరెడ్డి, సురేష్, వెంకట్రాముడు, దస్తగిరి పాల్గొన్నారు.

డివిజన్ స్థాయిలో పరిష్కార వేదిక


వినూత్న ఒరవడికి కలెక్టర్ శ్రీకారం

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: గత వైకాపా పాలనలో భూకబ్జాలు, దౌర్జన్యాలు, ఆక్రమణలు రాజ్యమేలాయి. తమకు అన్యాయం జరిగిందంటూ చెప్పుకునే స్వేచ్ఛ, హక్కును అణగదొక్కారు. దీని మూలంగా తమ గోడును వెల్లబోసుకోడానికి కూడా భయపడే పరిస్థితి నెలకొని ఉండేది. ప్రస్తుతం రాష్ట్రంలో తెదేపా కూటమి ప్రభుత్వ పాలన వచ్చిన తర్వాత.. బాధితులు కుప్పలు తెప్పలుగా బయటకు వస్తున్నారు. గత వైకాపా పాలనలో తమకు జరిగిన అన్యాయం, వ్యథలను చెప్పుకుంటున్నారు. భూములను ఆక్రమించారు.. తమపై దౌర్జన్యం చేశారు. స్థలాలను కాజేశారు... అంటూ ప్రతి సోమవారం జిల్లా స్థాయిలో జరిగే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు బాధితులు తరలి వచ్చి అర్జీలు ఇస్తున్నారు. ఇందులో 70 శాతానికిపైగా భూములకు సంబంధించినవే ఉన్నాయి. గతంలో గడిచిన సోమవారం (23న) ఏకంగా 550 వినతులు రావడం విశేషం. ఇందులో 350కిపైగా రెవెన్యూ శాఖకు సంబంధించినవే ఉండటం ప్రస్తావానార్హం. బాధితులకు న్యాయం చేకూర్చడానికి కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ జిల్లా స్థాయిలోనే కాకుండా... డివిజన్ స్థాయికి ప్రజా సమస్యల పరిష్కార వేదికను విస్తరించాలని సంకల్పించారు.

● ఈనెల 30న డివిజన్ స్థాయి అర్జీల స్వీకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. ప్రథమంగా అనంత ఆర్డీఓ కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తారు. కలెక్టర్, జేసీ, ఇతర అన్ని శాఖల జిల్లా అధికారులు ఇక్కడే పాల్గొంటారు. కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో యథాప్రకారం అర్జీలు తీసుకుంటారు. కానీ ద్వితీయ శ్రేణి అధికారులు ఇక్కడ పాల్గొంటారు. అనంత ఆర్డీఓ కార్యాలయంలో మాత్రం నిర్దేశిత మండలాలకు సంబంధించిన బాధితులు అన్ని రకాల అర్జీలు ఇవ్వవచ్చు. అనంత గ్రామీణం, రాప్తాడు, నార్పల, గార్లదిన్నె, కూడేరు, ఆత్మకూరు, శింగనమల, తాడిపత్రి, పెద్దపప్పూరు, పుట్లూరు, యల్లనూరు.. వంటి మండలాల నుంచి ఎక్కువ మంది రెవెన్యూ సమస్యలతో వస్తున్నారు. అందుకే ప్రథమంగా ఇక్కడే అర్జీల స్వీకరణకు నడుం బిగించారు.



నీరు చేరిన మిడ్‌పెన్నార్ ప్రాజెక్టు



దక్షిణ కాలువకు నీరు విడుదల

నీటి రాక మొదలు.. ఆనందం రెండింతలు

హెచ్చెల్సీ నీటి రాకతో గార్లదిన్నె మండలంలోని పెనకచర్ల గ్రామంలో మిడ్‌పెన్నార్ జలాశయానికి జలకళ సంతరించుకుంది. చుట్టూ కొండలు, గుట్టలు పచ్చదనం పరచుకున్నాయి. దీనికి జలకళ తోడవడంతో పరిసర ప్రాంతాలు కనువిందు చేస్తున్నాయి. 5.2 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యం ఉన్న జలాశయానికి ప్రస్తుతం 1.6 టీఎంసీల తుంగభద్ర జలాలు చేరాయి. జలాశయం దక్షిణ కాలువ ద్వారా ఇటీవల సాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేయటంతో ఆయకట్టు రైతుల్లోనూ ఆనందం వ్యక్తం అవుతోంది.

- ఈనాడు, అనంతపురం

రూ.125.37 కోట్లు పింఛన్ సొమ్ము మంజూరు



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ శివనారాయణ శర్మ, సహాయ కలెక్టర్ వినూత్న

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ భరోసా పథకం కింద అక్టోబరు ఒకటో తేదీన సామాజిక పింఛన్ పంపిణీ జరుగుతుందని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఇంటింటా వెళ్లి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. జిల్లా మొత్తం 2,85,933 మంది లబ్ధిదారులకు రూ.125.37కోట్లు మంజూరైందని తెలిపారు. శనివారం తన క్యాంపు కార్యాలయం నుంచి ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లతో జేసీ శివనారాయణ శర్మ, సహాయ కలెక్టర్ వినూత్నలతో కలిసి కలెక్టర్ వీక్షణ సమీక్ష నిర్వహించారు. ఒకటో తేదీనే వంద శాతం నమోదు కావాలి. ఏదైన కారణాలతో ఇవ్వకపోతే 2వ తేదీన పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. గతంలో మాదిరే ఒకటో తేదీ ఉదయం 6గంటల నుంచే పంపిణీకి శ్రీకారం చుట్టాలన్నారు.

ఫ్రీ హోల్డ్ భూములపై సమగ్ర విచారణ

గత ప్రభుత్వ హయాంలో ఫ్రీ హోల్డ్ చేసిన 23,399 ఎకరాల భూములపై సమగ్ర విచారణ చేస్తామని కలెక్టర్ ప్రకటించారు. శనివారం సీసీఎల్ఏ జయలక్ష్మి విజయవాడ నుంచి వీసీ నిర్వహించారు. ఆ తర్వాత జేసీ శివనారాయణ శర్మతో కలిసి తహసీల్దార్లు, ఆర్డీఓలతో మాట్లాడారు. ఫ్రీ హోల్డ్ భూములు ఎన్ని ఎకరాలు, ఇందులో ఎంత భూమి రిజిస్టర్ అయింది. ఏయే పేర్లతో చేశారు... వంటి సమగ్ర వివరాల ఆధారంగా విచారణ చేయాలని సూచించారు. ఈ భూములపై పునః పరిశీలన చేసి తగిన నివేదిక పంపాలన్నారు. అక్టోబరు 5వ తేదీలోపు పూర్తి వివరాలు పంపాలన్నారు. ఆ 23,993 ఎకరాల్లో 99.679 ఎకరాలు రిజిస్టర్ అయిందన్నారు.

● గుంతకల్లు రెవెన్యూ డివిజన్ పరిధిలో 770 మంది ప్రభుత్వ ఉద్యోగులు రెడ్‌క్రాస్‌లో చేరడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు. సభ్యత్వ రుసుం రూ.1,85,900 చెక్కును కలెక్టర్‌కు ఆర్డీఓ శ్రీనివాస్‌రెడ్డి, రెడ్‌క్రాస్ ప్రతినిధులు కలిసి అందజేశారు.

రుణం ఇప్పిస్తానంటూ.. రూ.24 లక్షలు వసూలు

వైకాపా నాయకుడి అరెస్టు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అధికారం మారినా, వైకాపా నాయకుల అక్రమాలు, దౌర్జన్యాలు ఆగలేదు. తమకు ఎదురే లేదనట్లు వ్యవహరిస్తున్నారు. నేటికీ మోసాలు, కబ్జాలకు పాల్పడుతున్నారు. అనంతపురం నగరానికి చెందిన ఓ వైకాపా నాయకుడి అక్రమాల లీల ఇటీవల పోలీసుల విచారణలో బహిర్గతమైంది. ఆత్మకూరు మండలం పి.యాలేరు గ్రామానికి చెందిన యన్నం ఆంథోనిరెడ్డి వైకాపా నాయకుడిగా చలామణి అవుతున్నాడు. రాప్తాడు నియోజకవర్గంలో క్రియాకీలకంగా వ్యవహరిస్తున్నాడు. ఇతడు కర్ణాటక రాష్ట్రం హొసపేట తాలుకా బసవేశ్వర బడవనే గ్రామానికి చెందిన శ్యామ్‌రాజ్‌సింగ్‌తో పరిచయం పెంచుకున్నాడు. వ్యాపారానికి భారీ మొత్తంలో రుణాన్ని ఇప్పిస్తామని, అందుకు ఖర్చు అవుతుందని బాధితునికి చెప్పాడు. డబ్బు అవసరం కావడంతో బాధితుడు ఆంథోనిరెడ్డి బ్యాంకు ఖాతాలోకి గత నెలలో రూ.24 లక్షలు బదిలీ చేశాడు. రుణం ఇప్పించలేదు. సరికదా ఫోన్‌కు కూడా స్పందించలేదు. నగరానికి వచ్చి డబ్బివ్వాలని అడగడంతో బాధితుడు శ్యామ్‌రాజ్‌ను బెదిరించారు. మరోసారి డబ్బులు డిమాండ్ చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని బాధితున్ని భయపెట్టారు. ఇటీవల బాధితుడు ఎస్పీ జగదీశ్‌కు ఫిర్యాదు చేశాడు. ప్రధాన నిందితుడు ఆంథోనిరెడ్డితోపాటు మనోహర్‌రెడ్డి, మేకల ప్రతాప్‌కుమార్, శరత్‌బాబు, నాగరాజులపై అనంత గ్రామీణం పోలీసులు కేసు నమోదు చేశారు.

దేవీశరన్నవ రాత్రుల ఉత్సవాలకు సిద్ధం

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే: అనంతపురంలోని పాతూరు వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి శరన్నవ రాత్రుల మహోత్సవాలకు సర్వం సిద్ధం చేసినట్లు అధ్యక్షుడు పిన్ని నాగరత్నం పేర్కొన్నారు. శనివారం పాతూరు కన్యకాపరమేశ్వరి ఆలయంలో కమిటీ కార్యవర్గంతో కలిసి ఆహ్వాన పత్రికలు, సంచికను విడుదల చేశారు. అక్టోబరు 3 నుంచి 13 వరకు పలు రూపాల్లో ఉత్సవమూర్తులు, మూలవిరాట్‌ను అలంకరించనున్నట్లు ఆయన తెలిపారు.

గుండె లయ.. మారుతోందయా!

నేడు హృదయ దినోత్సవం






సూపర్‌స్పెషాల్టీ కార్డియాలజీ విభాగంలో చికిత్స పొందుతున్న బాధితులు

అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే

జీవనశైలిలో వేగంగా వస్తున్న మార్పులతో హృదయ సంబంధిత వ్యాధుల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. వయసుతో నిమిత్తం లేకుండా గుండెపోటుకు గురవుతుండటం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా గడిపిన వారు ఉన్నఫళంగా కుప్పకూలి మృత్యువడికి చేరుకుంటున్నారు. రోజువారీ పనుల్లో ఒత్తిడి, వ్యాయామం చేయకపోవటం, ఆహార అలవాట్లు, పొగ తాగడం.. తదితర కారణాలతో ఎక్కువ మంది గుండెపోటుకు గురవుతున్నారని వైద్యులు చెబుతున్నారు. చికిత్స పొందుతున్న వారిలో సగటున ఒకటి నుంచి 2 శాతం మంది ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొంటున్నారు.

ఇవి పాటిద్దాం..

రోజూ కనీసం 45 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి. చెమట పట్టేంత వరకు నడక సాగించాలి. ఆకుకూరలు, కూరగాయలతోపాటు పండ్లు తినాలి. బీపీ, షుగర్‌ను నియంత్రణలో ఉంచుకోవాలి. ఎత్తుకు తగిన బరువు ఉండేలా చూసుకోవాలి.



సూపర్‌స్పెషాల్టీ వైద్యశాలలో 20 వేల మందికిపైగా..

అనంతపురంలోని సూపర్‌స్పెషాల్టీ వైద్యశాలలో కార్డియాలజీ విభాగం ఉంది. 2022 నుంచి ఓపీ, ఐపీ సేవలు ప్రారంభించారు. అప్పటి నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు 20,753 మందికి ఓపీ సేవలు అందించారు. 924 మంది ఇన్‌పేషెంట్లు చికిత్స చేయించుకున్నారు. వారిలో 642 మందికి యాంజియోగ్రామ్ చేశారు. 266 మందికి స్టంట్స్ వేశారు. ఇప్పటి వరకు 79 మంది మృతి చెందారు.

ఉమ్మడి అనంత జిల్లాలో ఆరోగ్యశ్రీ (ప్రస్తుతం ఎన్టీఆర్ వైద్యసేవ) కింద గుండె సంబంధిత వ్యాధులకు చికిత్స పొందిన వారి వివరాలు ఇలా..

సంవత్సరం	చికిత్స పొందిన వారు	బైపాస్ సర్జరీ	స్టంట్స్, ఔషధాలతో చికిత్స పొందిన వారు
2022-23	7,909	1,946	5,963
2023-24	10,365	934	9,431
2024 (ఆగస్టు వరకు)	2,827	310	2,500

స్వస్తి పలుకుదాం!



సాధ్యమైనంత వరకు కొవ్వు సంబంధిత పదార్థాలకు దూరంగా ఉండాలి. పిజ్జా, బర్గర్, ఫ్రెంచ్‌ఫ్రైస్, చాక్లెట్లు, మటన్ తదితర వాటిని తీసుకోకపోవడమే ఉత్తమం. ఒత్తిడికి లోను కావద్దు. సాధ్యమైనంత వరకు ప్రశాంతంగా ఉండేలా చూసుకోవాలి. అనవసర విషయాలపై ఆలోచించి ఆందోళనకు గురికావద్దు.

లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయవద్దు

- డాక్టర్ సుభాష్‌చంద్ర బోస్, అసిస్టెంట్ ప్రొఫెసర్, కార్డియాలజీ, సూపర్‌స్పెషాల్టీ వైద్యశాల



ఛాతిమీద బరువుగా, పట్టేసినట్లు ఉండటం, మంట రావడం, చేయి నుంచి దవడ వరకు నొప్పి, చెమటలు పట్టడం.. తదితర లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని వైద్యులను సంప్రదించాలి. వారి సూచన మేరకు చికిత్స పొందాలి. ప్రతి ఒక్కరూ సీపీఆర్ విధానంపై అవగాహన కలిగి ఉండాలి. కొంత మందిలో హార్ట్‌బీట్ పెరుగుతుంటుంది. అలాంటి సమయాల్లో గట్టిగా దగ్గితే సాధారణ స్థితికి చేరుకుంటుంది. గుండెపోటు లక్షణాలు బహిర్గతమైతే వెంటనే ఆసుపత్రికి వెళ్లాలి. ఉమ్మడి జిల్లాలోని ప్రాంతీయ, సామాజిక ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది పరీక్ష చేసి.. గుండెపోటు వచ్చినట్లు నిర్ధారిస్తే వెంటనే ఆరోగ్యసురక్ష కార్యక్రమంలో భాగంగా రూ.42 వేలు చేసే టెనెక్ట్‌ప్లేస్ ఇంజెక్షన్ ఉచితంగా వేస్తారు. గుండెపోటు మరణాలను తగ్గించేందుకు ఇంజెక్షన్లను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. ఇంజెక్షన్ వేసిన అనంతరం రోగి కోలుకున్న తరువాత మెరుగైన చికిత్స కోసం నెట్‌వర్క్ ఆసుపత్రులకు పంపుతారు.


మధుర ఫలం.. ఆరోగ్యం.. ఆదాయం

రాయదుర్గం, న్యూస్‌టుడే: తేనె లాంటి తియ్యదనం.. ఆరోగ్యాన్నిచ్చే సీతాఫలాల విక్రయాలు రాయదుర్గం మార్కెట్లో ఊపందుకున్నాయి. కొండలు, గుట్టలు, అడవుల్లో వర్షాధారంగా లభించే ఈ మధుర ఫలాలు వేల మంది రైతులు, కూలీలకు ఉపాధినిస్తున్నాయి. పలువురు రైతులు తోటల్లో అంతర పంటగా సాగు చేసి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి పొందుతున్నారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురవటంతో ఆశించిన మేర దిగుబడి వచ్చింది. రోజూ టన్నులకొద్దీ సీతాఫలాలు లభిస్తున్నాయి. ఈ లెక్కన సీజన్(సెప్టెంబరు నుంచి డిసెంబరు) వరకు దాదాపు వంద టన్నుల దిగుబడి రావచ్చని రైతులు చెబుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో లభించే సీతాఫలాల కన్నా.. ఇక్కడి ఫలాలు మధురంగా ఉంటాయి. రాయదుర్గం కొండల్లో మేలురకం సీతాఫలాలు లభిస్తున్నట్లు గతంలోనే ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ, ఉద్యాన శాస్త్రవేత్తలు గుర్తించారు.

ఆశాజనకంగా దిగుబడి

పరిమాణం మేరకు ధర

గంపల్లో తెచ్చిన వంద సీతాఫలాలను రూ.250 నుంచి రూ.500 దాకా విక్రయిస్తున్నారు. పరిమాణం, నాణ్యతను బట్టి కిలో రూ.60- రూ.80 దాకా ధర పలుకుతోంది. ఇక్కడి నుంచి బెంగళూరు, అనంతపురం, బళ్లారి, దావణగెరె, శివమొగ్గ, హాసన్, చిత్రదుర్గ తదితర ప్రాంతాలకు వ్యాపారులు ఎగుమతి చేస్తున్నారు.





సీతాఫలాల విక్రయాలు

వెయ్యి కుటుంబాలకుపైగా ఉపాధి

రాయదుర్గం మండలంలోని మెచ్చిరి, పైతోట, కొండలు, గుమ్మఘట్ట మండలం శిరిగేదొడ్డి తదితర ప్రాంతాల్లో సీతాఫలాలు లభిస్తాయి. వాటి విక్రయాలతో వెయ్యి కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి. ఆ చెట్లు ఉండే కొండను ఏటా రూ.50వేలకు వార్షిక సంపం నాయకులు పొంది సబ్‌లీజుకు ఇస్తుంటారు. వన సంరక్షణ సమితుల ఆధ్వర్యంలో రైతులు చెట్లను కౌలుకు చేసి సీతాఫలాలను పట్టణంలో విక్రయిస్తుంటారు.

మార్కెట్ సౌకర్యం కల్పించాలి

ఈ ఏడాది పంట దిగుబడి ఆశాజనకంగా ఉంది. మూడు నెలల పాటు రైతులు, వ్యవసాయ కూలీలు, వీధి వ్యాపారులకు ఉపాధి లభిస్తుంది. అటవీశాఖాధికారులు సీతాఫలం చెట్లను విరివిగా పెంచాలి. మార్కెట్ సౌకర్యం కలిస్తే మరింత ఆదాయం సమకూరనుంది. **- తిప్పేస్వామి, రాయదుర్గం**



ఫ్లాష్.. ఫ్లాష్.. ఫ్లాష్

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

◆ రెండు వాహనాల ఢీ ◆ 10 మందికి తీవ్ర గాయాలు ◆ ముగ్గురి పరిస్థితి విషమం ◆ క్షతగాత్రులను అనంతపురం ఆసుపత్రికి తరలింపు

గార్లదిన్నె, న్యూస్‌టుడే: బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఏపీఎం ట్రావెల్ బస్సు, ఇదే మార్గంలో మహబూబ్‌నగర్ జిల్లా కొత్తకోటకు వెళ్తున్న ఐచర్ వాహనం శనివారం అర్ధరాత్రి దాటాక 2.30 గంటల ప్రాంతంలో జాతీయ రహదారి 44పై గార్లదిన్నె మండలం కలగాసపల్లి వద్ద ఢీకొన్నాయి. ఈ ఘటనలో 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో బస్సు క్లీనర్, ఇద్దరు కూలీల పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారు తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్‌కు చెందిన కూలీలు. ఈ ఘటనతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. ఎస్సై గౌస్ బాషా, పోలీస్ సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. రాకపోకలు సాఫీగా జరిగేలా పర్యవేక్షించారు.











గార్లదిన్నె మండలం కలగాసపల్లి వద్ద జాతీయ రహదారిపై ప్రమాద దృశ్యాలు



దిల్లీలో రాజముద్రతో కూడిన పట్టువస్త్రాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్రజౌళిశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్

ధర్మవరం చేనేత వస్త్రంపై రాజముద్ర

ధర్మవరం, న్యూస్‌టుడే: హిందీ పక్షం పురస్కరించుకొని ధర్మవరం చేనేత కార్మికుడు, డిజైనర్ జుజూరు నాగరాజు రూపొందించిన హిందీ దేశ గర్వం అనే నినాదం, భారత రాజముద్ర డిజైన్‌తో కూడిన పట్టువస్త్రాన్ని శనివారం దిల్లీలో కేంద్రజౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ ఆవిష్కరించారు. విజయవాడ చేనేత సేవాకేంద్రం సహకారంతో డిజైనర్ నాగరాజు పట్టు, బంగారు జరీ పోగులను ఉపయోగించి పట్టువస్త్రంపై చేతితో డిజైన్ వేశారు. వస్త్ర తయారీలో చేనేత కార్మికుడు సురేంద్ర బాబు, రాఘవ సహాయపడ్డారని నాగరాజు తెలిపారు.

బీఈడీ కళాశాలలో తాత్కాలిక బోధన ఉద్యోగాలు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని బీఈడీ కళాశాలలో తాత్కాలిక బోధన ఉద్యోగాలు (అకడమిక్ కన్సల్టెంట్) భర్తీ చేస్తున్నట్లు ప్రిన్సిపల్ సోమశేఖర్ తెలిపారు. ఫిజికల్ సైన్స్ మెథడాలజీ, ఎంఈడీ, పీహెచ్‌డీ, నెట్ ఉన్నవారు ఉద్యోగాలకు అర్హులు. ఈ నెల 30న నేరుగా వాక్ఇన్‌ఇంటర్వ్యూకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి





సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.



రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

మరిన్ని వివరాలకు.. www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

లడ్డూ తయారీలో కల్తీ నెయ్యిపై జగన్ క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో తిరుమల వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యిని సరఫరా చేసి భక్తుల మనోభావాలు దెబ్బ తీశారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం ధర్మవరం పట్టణంలో తన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. కమీషన్లకు కక్కుర్తి పడే నాసిరకం నెయ్యి సరఫరా చేశారన్నారు. అప్పటి సీఎంగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి బంధుప్రీతితో వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డిని తి.తి.దే ఛైర్మన్లుగా, అనుకూలంగా ఉన్న అధికారి ధర్మారెడ్డిని ఈవోగా నియమించారని ఆరోపించారు. చేసిన తప్పులు ఒప్పుకొని జగన్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. గత ఐదేళ్లలో తిరుమల పవిత్రతను తగ్గించే విధంగా జగన్ వ్యవహరించారని విమర్శించారు. దళితులను అన్యమతస్థులుగా జగన్ చిత్రీకరిస్తూ మాట్లాడుతుండటం వారిని అవమానించడమేనన్నారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో నాసిరకం నెయ్యి వినియోగంపై సరైన విచారణ జరుగుతుందని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు ఉంటాయని వివరించారు.

మద్దతు ధరతో పత్తి కొనుగోలు

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా జిల్లా మార్కెటింగ్‌శాఖ సహకారంతో జిల్లాలో గుత్తి, తాడిపత్రి వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, ప్రభుత్వ మద్దతు ధరతో పత్తిని కొనుగోలు చేయడం జరుగుతుందని మార్కెటింగ్‌శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు రామాంజనేయులు (కడప), జిల్లా సహాయ సంచాలకులు సత్యనారాయణ చౌదరి తెలిపారు. పొడవు పింజ పత్తి క్వింటాలు రూ.7,521, పొట్టిపింజ పత్తి క్వింటాలు రూ.7,121 చొప్పున కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతు సేవా కేంద్రాల్లో పత్తి రైతులు సీఎం యాప్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని వారు కోరారు. రైతులు పత్తిని ఆరబెట్టి దుమ్ము, ధూళి లేకుండా శుభ్రపరిచి కేంద్రాలకు తీసుకురావాలన్నారు. ప్లాస్టిక్ సంచులు వినియోగించరాదన్నారు. తేమ 8 శాతం ఉంటే పూర్తి మద్దతు ధర లభిస్తోందన్నారు. అంతకంటే తక్కువ ఉంటే ప్రతి ఒక్క శాతానికి రూ.75.21 పైసలూ కనీస మద్దతు ధర కంటే తగ్గుతుందన్నారు.

● కర్నూలు జిల్లాలోని ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, పెంచికలపాడు వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని మార్కెటింగ్‌శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు రామాంజనేయులు తెలిపారు.

గడువులోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తవ్వాలి



మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, పీడీ శైలజ, డిప్యూటీ కమిషనరు వెంకటేశ్వర్లు

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లావ్యాప్తంగా ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేసుకోవాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సూచించారు. శనివారం లబ్ధిదారులకు నిర్వహించిన అవగాహన సదస్సులు సందడిగా సాగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే అనంతపురం జిల్లాలో ఇప్పటి వరకు 1,945 ఇళ్లను పూర్తి చేశారు. మరింత వేగంగా ఇళ్లను పూర్తి చేయాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం మన ఇళ్లు-మన గౌరవం పేరుతో గృహ నిర్మాణ లబ్ధిదారులతో అవగాహన సదస్సులు చేపట్టినట్లు తెలిపారు. అనంతపురంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ హాజరై మాట్లాడారు.

'ప్రభుత్వమే మద్యం విక్రయించాలి'

కమలానగర్ : రాష్ట్ర ప్రభుత్వం అక్టోబరు 1 నుంచి ప్రవేశపెడుతున్న నూతన మద్యం పాలసీని ఉపసంహరించుకోవాలని, మద్యం విక్రయాలు ప్రభుత్వమే చేయాలని పలు ప్రజా, కార్మిక సంఘాల నేతలు పేర్కొన్నారు. శనివారం ఎన్జీవో సమావేశ భవనంలో నూతన మద్యం పాలసీని వ్యతిరేకిస్తూ మద్యం ఆదాయ వనరా? ప్రజా సంక్షేమమా? అనే అంశంపై ఐద్వా ఆధ్వర్యంలో చర్చ వేదిక నిర్వహించారు. ఈ వేదికకు 5వ రాష్ట్ర కోశాధికారి సావిత్రి, రెడ్స్ సంస్థ అధ్యక్షురాలు భానుజా, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు శ్రీవల్లి, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పార్వతి, ప్రగతిశీల మహిళా సంఘం అధ్యక్షురాలు సరస్వతి, కేపీఎస్ నల్లప్ప, ఆవాజ్ వలి, వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణమూర్తి పాల్గొని మాట్లాడారు. మద్యం వల్ల మహిళలు నష్టపోతున్నారన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించుకోవాలన్నారు.

జాయింట్-I సబ్ రిజిస్ట్రార్ బాధ్యతల స్వీకరణ

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: అనంతపురం అర్బన్ జాయింట్-1 సబ్‌రిజిస్ట్రార్‌గా రమణరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ధర్మవరం సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ఆయన్ను ఇక్కడికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జాయింట్-2 సబ్‌రిజిస్ట్రార్ యూనస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. గతంలో రమణరావు కర్నూలు డీఐజీ కార్యాలయంలో, రాయలసీమలోని వివిధ జిల్లాల్లో సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేశారు. సబ్‌రిజిస్ట్రార్ యూనస్, ఇతర సిబ్బంది, దస్తావేజుల సంఘం రాష్ట్ర నాయకుడు డి.సుధాకర్, ఇతర సభ్యులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

క్రైస్తవ భవన్‌కు రూ.10 కోట్లు మంజూరు



స్వామిదాస్

అనంతపురం (కళ్యాణదుర్గం రోడ్డు), న్యూస్‌టుడే : అసంపూర్తిగా ఆగిన క్రైస్తవ భవన్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్లు నిధులు కేటాయించడంపట్ల క్రిష్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం అనంతపురం అర్బన్ తెదేపా కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ 2014-19 మధ్య అప్పటి తెదేపా ప్రభుత్వం క్రైస్తవ భవన్‌కు రెండెకరాలు కేటాయించి రూ.16 కోట్లు నిధులు కూడా విడుదల చేయడం జరిగిందన్నారు. ఐదేళ్లుగా వైకాపా ప్రభుత్వం రాగానే పనులు పూర్తి నిలిచి పోయాయన్నారు. క్రైస్తవుల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు ఉదారత చూపి రూ.10 కోట్లు నిధులు విడుదల చేశారన్నారు. రాష్ట్రంలో క్రైస్తవ కార్పొరేషన్ కూడా నిర్వీర్యం చేశారని గుర్తు చేశారు. జెరూసలేం యాత్రకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు.

జల్సాలు, సెల్‌ఫోన్‌పై మోజుతో చోరీల బాట

● ఇద్దరు బాలలు అదుపులోకి..



స్వాధీనం చేసుకున్న బంగారు కడ్డీ, కెమెరా, చరవాణులు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం నగరంలో పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడిన ఇద్దరు బాలలను నాలుగో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.ఆరు లక్షలు విలువ చేసే 7 తులాల బంగారు కడ్డీ, ద్విచక్ర వాహనం, ఐఫోన్, కెమెరా, ఇతర సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల పట్టణానికి చెందిన ఇద్దరు బాలలు ఈ ఏడాది ఆగస్టు చివరి వారంలో తపోవనంలో ఓ ఇంట్లోకి ప్రవేశించి బంగారు, వెండి ఆభరణాలను చోరీ చేశారు. స్థానిక చంద్రబాబు కొట్టాలలోని ఓ ఫొటో స్టూడియో షట్టర్ ధ్వంసం చేసి అందులోని ఖరీదైన కెమెరా, బ్యాటరీ ఇతర సామగ్రిని, పామిడిలో మెడికల్ స్టోర్‌లో ఎలక్ట్రిక్ స్టార్టర్ పెట్టె, నగదు దొంగలించారు. వరుస చోరీలకు పాల్పడటంతో పోలీసులు దృష్టి సారించారు. నగరంలో చోరీల ప్రయత్నం చేస్తుండగా పట్టుకున్నారు. వీరిద్దరూ గంజాయి, మద్యానికి అలవాటు పడ్డారు. దానికితోడు ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్లపై మోజుతో వాటిని కొనడానికి, జల్సాలకు దొంగతనాలు చేసేవారు. వీరు చేసే నేరాలకు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. శనివారం నాలుగో పట్టణ పోలీసులు జువైనల్ జస్టిస్ బోర్డు ఎదుట హాజరు పరిచి, అనంతరం జువైనల్ హోంకు తరలించారు.

ఆర్ఈఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడి నియామకం

ఎస్కేయూ: రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎండీ నాగభూషణం నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామచంద్ర శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన అన్నారు.

సకాలంలో కార్డుదారులకు నిత్యావసరాలు అందాలి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: కార్డుదారులకు సకాలంలో నిత్యావసర వస్తువులు అందేలా చర్యలు తీసుకోవాలని సంయుక్త కలెక్టర్ శివనారాయణశర్మ అధికారులను ఆదేశించారు. ఆయన శనివారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ.. నిత్యావసర వస్తువుల తూకంలో లోపం లేకుండా చూడాలన్నారు. ఐసీడీఎస్ స్టాక్‌ను ఎండీయూల ద్వారానే స్కూళ్లకు, అంగన్‌వాడీలకు పంపాలన్నారు. సీఎస్‌డీటీలకు వారి పరిధిలోని రేషన్ షాప్‌లను, ఎండీయూలను తనిఖీ చేయాలన్నారు. సరుకులు సక్రమంగా లబ్ధిదారులకు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు.

రాయదుర్గం

•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

వైభవంగా ఏకాదశి పూజలు



బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: మండలంలోని ఉంతకల్లు గ్రామంలోని రుక్మిణీ పాండురంగ స్వామి ఆలయంలో శనివారం ఏకాదశి పూజలు వైభవంగా జరిగాయి. స్వామికి ఉదయం ప్రత్యేక జలంతో అభిషేకం, పుష్పాలంకరణ, కుంకుమార్చన, పంచామృతాభిషేకం చేసి పూజలు నిర్వహించారు. రాత్రి పల్లకి మహోత్సవం జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. • నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

ప్రత్యేక అలంకరణలో రుక్మిణీ పాండురంగస్వామి

మధ్యాహ్నానికే సచివాలయం ఖాళీ



ఖాళీగా కుర్చీలు

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: బొమ్మనహాళ్ సచివాలయంలో శనివారం మధ్యాహ్నం 12.10 గంటలకు సిబ్బంది కనిపించలేదు. తలుపులు తీసి ఉన్నాయని, ఎవరూ లేరని స్థానికుడు సంజప్ప ఆరోపించారు. అధికారులు తగు చర్యలు తీసుకుని సచివాలయాల్లో సిబ్బంది వేళకు హాజరయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఎంపీడీవో షకీలా బేగం, పంచాయతీ కార్యదర్శి బాబాఫకృద్దీన్ వివరణ కోరగా స్వచ్ఛత హీ కార్యక్రమం ఉన్నందున సిబ్బంది గ్రామంలో జరిగే కార్యక్రమానికి వెళ్లినట్లు చెప్పారు.

తారురోడ్డు అన్నారు.. మట్టితో సరి చేశారు



బొమ్మనహాళ్ మండలంలోని ఉద్దేహాళ్ నుంచి ఉరవకొండకు వెళ్లే రోడ్డు ఇది. గుంతలు పడి బురదతో నిండి అధ్వానంగా మారింది. ఉద్దేహాళ్ నుంచి ఉరవకొండ, దర్గాహొన్నూరు, అనంతపురానికి వెళ్లేందుకు ఈ రోడ్డు ఎంతో అవసరం. గత వైకాపా ప్రభుత్వం తారు రోడ్డు నిర్మాణానికి రూ.3కోట్లు కేటాయించామని ప్రకటించింది. అయితే మట్టి వేసి సరి చేశారు. ప్రస్తుతం అడుగడుగునా గుంతలు పడి ఛిద్రమైంది. ఆయా గ్రామాల ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు ఈ మార్గంలో రాకపోకలకు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ప్రభుత్వం తగు చర్యలు తీసుకుని తారు రోడ్డు నిర్మించాలని వారు కోరుతున్నారు. విషయాన్ని పంచాయతీరాజ్ ఏఈఈ జగదీశ్ దృష్టికి తీసుకువెళ్లగా పరిశీలిస్తామన్నారు. ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపి, రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

- న్యూస్‌టుడే, బొమ్మనహాళ్

ప్రారంభించి ఐదేళ్లు.. పూర్తికి ఇంకెన్నాళ్లు?



ఉరవకొండ మండలం వెలిగొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం అసంపూర్తిగా ఉంది. ఇక్కడ 6-10వ తరగతి చదివే విద్యార్థులు 112 మంది ఉన్నారు. గదుల కొరత ఉండటంతో గత తెదేపా ప్రభుత్వ హయాంలో ఆర్ఎంఎస్ఏ కింద రూ.65లక్షలతో ఆరు అదనపు గదుల నిర్మాణాన్ని మంజూరు చేసింది. వాటి పనులు అప్పట్లోనే 70శాతం వరకు పూర్తయ్యాయి. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయలేదు. ఫలితంగా గత ఐదేళ్లుగా పనులు ముందుకు సాగలేదు. విద్యార్థులకు సరిపడా గదులు లేక ఇబ్బందులు తప్పడం లేదు. దీనిపై ఎంఈవో ఈశ్వరప్ప వివరణ కోరగా నాడు-నేడు నిధుల కోసం ప్రతిపాదించామన్నారు. **- న్యూస్‌టుడే, ఉరవకొండ**

వాహనదారులూ జాగ్రత్త



కళ్యాణదుర్గంలో వర్షం కురిస్తే పలు ప్రాంతాల్లో మట్టి కొట్టుకుపోయి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక పాత బస్టాండ్ ఎదురుగా ఓ కాలనీకి వెళ్లే సీసీ రోడ్డు ఎత్తుగా ఉండటంతో అక్కడ మట్టి వర్షానికి కొట్టుకుపోయి సుమారు నాలుగు అడుగుల గుంత ఏర్పడింది. అక్కడే నీటి పథకానికి సంబంధించి గేట్ వాల్వ్ పైప్ బయట పడింది. అటుగా ద్విచక్రవాహనాలు, ఆటోలు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంటోంది. రోజూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయమై సంబంధిత శాఖల అధికారులను వివరణ కోరగా ఒకరిపై ఒకరు చెప్పుకొంటున్నారు. ఎన్నిసార్లు చేసినా పరిస్థితి ఇలాగే ఉంటుందని, తామేమి చేయాలని చెప్పడం గమనార్హం.

- న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి



పాతిరెడ్డిని సత్కరిస్తున్న గ్రామస్థులు, పూర్వ విద్యార్థులు

బెళుగుప్ప, న్యూస్‌టుడే: విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి పాతిరెడ్డి అన్నారు. ఆయన కాలువపల్లి ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. శనివారం పాఠశాల పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్నేహితుల ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించి సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. పూర్వవిద్యార్థుల బృందం తరఫున పదో తరగతిలో 500 మార్కులు దాటిన విద్యార్థులకు రూ.2 వేలు ప్రోత్సాహక బహుమతి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణప్ప, సర్పంచి పెద్దన్న, గ్రామస్థులు ప్రభాకర్‌రెడ్డి, రామకృష్ణ, నాగరాజు, నాగిరెడ్డి, రామ్మోహన్, రామాంజనేయులు, లక్ష్మనాయక్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేయర్ బాధ్యతల స్వీకరణ

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం మండల సర్వేయర్‌గా ప్రభాకర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌ఛార్జిగా ఉన్న చంద్రశేఖర్ చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటం

- దుర్గంలో పుట్టగొడుగుల్లా ప్రైవేటు క్లినిక్‌లు
- నిబంధనలకు విరుద్ధంగా చికిత్సలు



రాయదుర్గంలో అనుమతి లేని ఓ క్లినిక్ ఎదుట తనిఖీలు చేస్తున్న అధికారులు

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: రాయదుర్గం పట్టణంలో ప్రైవేటు క్లినిక్‌ల నిర్వాహకులు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే క్లినిక్‌లు నిర్వహిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రోగులకు చికిత్సలు అందిస్తున్నారు. గత శుక్రవారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిణితో పాటు ప్రత్యేక బృంద సభ్యులు క్లినిక్‌లలో ఆకస్మిక తనిఖీలు చేయగా విస్తుబోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. పదో తరగతి చదివిన 24 ఏళ్ల వ్యక్తి నవజాత శిశువులకు సూదులు వేయడం, సెలైన్ ఎక్కించడాన్ని గుర్తించారు. మొత్తం మూడు క్లినిక్‌లను సీజ్ చేశారు.

వంద పడకల ఆసుపత్రి ఉన్నా..

రాయదుర్గం పట్టణంలో వంద పడకల ప్రాంతీయ ఆసుపత్రితోపాటు మరో మూడు పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. అయితే వలస కార్మికులు, అమాయకులు స్టెరాయిడ్స్ వాడుతుండటంతో వ్యాధి త్వరగా నయమవుతుందనే కారణంగా ఆర్ఎంపీ క్లినిక్‌లకు పరుగులు తీస్తున్నారు. అక్కడ ప్రథమ చికిత్స మాత్రమే చేయాల్సి ఉండగా.. కొందరు సూదులు వేయడం, సెలైన్, రక్తం ఎక్కించడం వంటివి చేస్తున్నారు. మొలల క్లినిక్‌లలో మహిళలకు పురుషులే చికిత్స చేస్తున్నట్లు అధికారుల విచారణలో వెల్లడైంది. గాలి, వెలుతురు లేని చిన్నపాటి దుకాణాల్లో క్లినిక్‌లు నిర్వహిస్తున్నట్లు అధికారుల తనిఖీల్లో బయట పడటంతో దుర్గం వాసులు ఉలిక్కిపడ్డారు.

ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు

✦ గుమ్మఘట్ట మండలం దేవిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పాదం నొప్పితో ఆర్ఎంపీ వద్దకు వెళ్లారు. అతడు సూదులు వేసి, మాత్రలు ఇచ్చాడు. వాటిని తిన్న మరుసటి రోజు నుంచి మోకాళ్ల నొప్పులు అధికం అయ్యాయి. గ్యాస్ట్రిక్ సమస్య పెరిగిపోయింది. అనంతపురంలో రూ.20వేలు ఖర్చు చేసుకుని వైద్యం చేయించుకున్నట్లు బాధితుడు వాపోయారు.

✦ రాయదుర్గం మండలం కెంచానపల్లికి చెందిన ఓ వ్యక్తి కుష్ఠుతో బాధపడుతున్నారు. గాయాలు మానకపోవడంతో ఆర్ఎంపీ వద్దకు వెళ్లారు. చికిత్స చేయడంతో గాయం మరింత పెరిగింది. ప్రస్తుతం ఆయన బళ్లారిలో చికిత్స పొందుతున్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

- ఈ.బి.దేవి, డీఎంహెచ్‌వో, అనంతపురం

ఆర్ఎంపీలు నిబంధనలకు విరుద్ధంగా చికిత్సలు చేసినా, అనుమతులు లేకుండా క్లినిక్‌లు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి వైద్యసేవలు పొందేలా సిబ్బందితో అవగాహన కల్పిస్తాం.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

రాయదుర్గం పట్టణం: 9666888046, కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661, ఉరవకొండ: 8008573071

సమస్య: శెట్టూరు మండలం పెరుగుపాళ్యం నుంచి వడ్డెపాళ్యం, పర్లచేడు, గంటయదొడ్డి వరకు గుంతలు పూడ్చాలి. **- ఓబుళపతి, పెరుగుపాళ్యం**
సమాధానం: తగిన చర్యలు తీసుకుంటాం.
సమస్య: పెరుగుపాళ్యంగేట్‌లో బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలి **- అశ్వర్థ, పర్లచేడు**
సమాధానం: పరిశీలిస్తాం. **- రఘురామ్‌రావు, ఇన్‌ఛార్జి ఎంపీడీఓ**
సమస్య: గుమ్మఘట్టలో రైతు భరోసా భవనం పూర్తి చేయాలి. **- సదాశివ**
సమాధానం: పనులు వేగవంతం చేస్తాం **- సురేశ్, ఈఓఆర్డీ, గుమ్మఘట్ట**
సమస్య: కలుగోడు నుంచి వేపలపర్తి క్రాస్‌కు వెళ్లే రోడ్డులో కంపచెట్లు తొలగించాలి. **- అనిల్, కలుగోడు**
సమాధానం: తొలగించేస్తాం. **- హెచ్.కవిత, సర్పంచి**

– న్యూస్‌టుడే, గుమ్మఘట్ట, శెట్టూరు

పైప్‌లైన్ మరమ్మతులకు అడ్డంకులు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: రోడ్డు మధ్యన ఉన్న తాగునీటి పైప్‌లైన్ తరచూ లీకేజీ అవుతుంది. దానికి మరమ్మతు చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు అనుమతి ఇవ్వడం లేదు. ఫలితంగా విలువైన నీరు వృథాగా పారుతున్నాయి. పీఏబీఆర్ నుంచి కళ్యాణదుర్గం పంప్ హౌస్‌కు నీరు సరఫరా అయ్యే ప్రధాన పైపు పట్టణ శివారులోని అక్కమాంబ ఆలయం వద్ద మూడు చోట్ల లీకేజీ ఏర్పడింది. ఈనెల మొదట్లోనే లీకేజీ కాగా 5-17వ తేదీ వరకు కార్మికులు సమ్మె బాట పట్టారు. 18 నుంచి వారు తిరిగి విధుల్లో చేరారు. నీరు పంపింగ్ చేసే సమయంలో లీకేజీలు ఉన్న చోట్ల భారీగా తాగునీరు వృథా అవుతున్నాయి. సత్యసాయి పథకం అధికారులు మరమ్మతులు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. రోడ్డును తవ్వేందుకు రోడ్లు భవనాల శాఖ అధికారులు అనుమతి ఇవ్వడంలేదు. రోజూ సుమారు 3 లక్షల లీటర్లకుపైగా నీరు వృథా అవుతున్నాయి. నీటి ఉద్ధృతికి రోడ్డు కోతకు గురయ్యే ప్రమాదం ఉంది. దీనిపై సత్యసాయి నీటి పథకం సూపర్‌వైజర్ సుబ్రహ్మణ్యం వివరణ కోరగా నీటిని పంపింగ్ చేస్తున్నాం. రోడ్డు కింది భాగంలో పైప్ లీకేజీ ఉంది. రోడ్లు భవనాల శాఖ అనుమతి తీసుకొని, మరమ్మతు చేస్తామన్నారు.

ప్రతి శనివారం ఉచిత ప్రసాదం

ఉరవకొండ, న్యూస్‌టుడే: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉచిత ప్రసాదాన్ని అందుబాటులోకి తెచ్చారు. ప్రతి శనివారం ఉదయం భక్తులకు పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో రమేశ్‌బాబు తెలిపారు. సాయంత్రం శ్రీవారి పల్లకీ ఉత్సవం నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని, ఉత్సవంలో పాల్గొన్నారు.

మార్చిలోపు ఇళ్లు పూర్తి చేస్తేనే బిల్లులు



నారాయణపురంలో మాట్లాడుతున్న డీఈ విజయభాస్కర్‌రావు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: ఎలాంటి అపోహలు లేకుండా పక్కా ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని డీఎల్‌డీవో శంకర్, హౌసింగ్ డీఈ విజయభాస్కర్‌రావు సూచించారు. శనివారం కురాకులతోట, ముదిగల్లు, నారాయణపురం గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో 'మన ఇల్లు - మన గౌరవం' కార్యక్రమం నిర్వహించారు. మార్చి ఆఖరులోపు నిర్మాణాలు పూర్తి చేసుకుంటే బిల్లులు మంజూరవుతాయని చెప్పారు. **కంబదూరు:** జగనన్న కాలనీల్లో ఇళ్ల లబ్ధిదారులకు హౌసింగ్ అధికారి రామకృష్ణ అవగాహన కల్పించారు. **కణేకల్లు:** పేదోడి సొంతింటి కల సాకారం చేయడమే ప్రభుత్వ ధ్యేయమని తహసీల్దారు ఫణికుమార్, ఎంపీడీఓ శ్రీనివాసులు, గృహ నిర్మాణ ఏఈ రామాంజనేయులు అన్నారు. శనివారం యర్రగుంటలో 'మన ఇల్లు- మన గౌరవం' నిర్వహించారు. మండలంలోని 11 లేఅవుట్‌లలో 180ఇళ్లు మంజూరు చేయగా కేవలం 74మాత్రమే పూర్తైనట్లు అధికారులు తెలిపారు. తెదేపా నాయకుడు వన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం



కలెక్టర్ వినోద్‌కుమార్‌కు డీడీ అందిస్తున్న ప్రిన్సిపల్, విద్యార్థులు

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల కోసం విద్యార్థులు సేకరించిన రూ.43,722ను శనివారం కలెక్టర్ వినోద్‌కుమార్‌కు అందజేసినట్లు ప్రిన్సిపల్ రఘురామమూర్తి తెలిపారు. పట్టణంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు చందాలు సేకరించినట్లు చెప్పారు. ఎన్ఎస్ఎస్ పీవో నారాయణ, ఎన్‌సీసీ సీటీవో కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వజ్రకరూరు: మండలంలోని పీసీ కొత్తకోట గ్రామానికి చెందిన ఉన్నత పాఠశాల విద్యార్థులు రూ.6920 విరాళం చెక్కును శనివారం తహసీల్దార్ నయాజ్‌అహమ్మద్, ఎంఈఓ ఎర్రిస్వామిలకు అందజేశారు. విద్యార్థులను హెచ్ఎం గోవిందునాయక్, ఉపాధ్యాయులు, తహసీల్దార్, ఎంఈఓలు అభినందించారు.



వజ్రకరూరు: తహసీల్దార్, ఎంఈఓలకు చెక్కు అందజేస్తున్న విద్యార్థులు

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా ఎంపిక



ధ్రువపత్రం అందుకుంటున్న రవి

ఉరవకొండ, న్యూస్‌టుడే: జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా ఉరవకొండ మండలం కౌకుంట్లకు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకుడు రవి ఎంపికయ్యారు. శనివారం గుంతకల్లు ఆర్డీవో కార్యాలయ ఏవో నుంచి ఆయన ధ్రువపత్రాన్ని అందుకున్నారు. మంత్రి పయ్యావుల కేశవ్, ఆయన సోదరుడు పయ్యావుల శ్రీనివాసుల చొరవతో కమిటీ సభ్యుడిగా ఎంపికైనట్లు తెలిపారు. ఆయన ఎంపికపై తెదేపా నాయకులు రామాంజనేయులు, గోపాల్ హర్షం వ్యక్తం చేశారు.

భగత్‌సింగ్‌కు నివాళి



కుందుర్పి: నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

కళ్యాణదుర్గం గ్రామీణం, కుందుర్పి, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం మండలంలోని నారాయణపురం ప్రాథమిక పాఠశాలలో, కుందుర్పిలోని విలువల బడుల్లో శనివారం భగత్‌సింగ్ జయంతి నిర్వహించారు. కళ్యాణదుర్గంలో ఉపాధ్యాయులు సురేష్‌బాబు, నరసింహులు, రమేష్ విద్యార్థులతో కలిసి భగత్‌సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

గుర్రం జాషువా కవిత్వాలతో చైతన్యం



విద్యార్థికి బహుమతి అందిస్తున్న వైస్ ప్రిన్సిపల్ మస్తానప్ప, అధ్యాపకులు

ఉరవకొండ, న్యూస్‌టుడే: గుర్రం జాషువా తన కవిత్వం ద్వారా సమాజంలోని మూఢనమ్మకాలను వ్యతిరేకిస్తూ, అనేక అంశాల్లో ప్రజలను చైతన్యం చేశారని ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ మస్తానప్ప అన్నారు. కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో జాషువ జయంతి నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకుడు పరమేశ్, అధ్యాపకులు రాజేశ్, కృష్ణవేణి, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

కుక్కలకు రేబిస్ టీకాలు



రాయదుర్గం: కుక్కలకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి

రాయదుర్గం, న్యూస్‌టుడే: పట్టణంలోని పశువైద్యశాలలో 44 కుక్కలకు రేబిస్ వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుక్కల యజమానులు సహకరించి 2030 నాటికి రేబిస్ వ్యాధి రహిత సమాజంలో అందరూ భాగస్వామ్యులు కావాలన్నారు.

కళ్యాణదుర్గం గ్రామీణం: కళ్యాణదుర్గం, ముద్దినాయనపల్లి, గోళ్ల పశువైద్యశాల, రైతు సేవా కేంద్రాల పరిధిలోని సుమారు 80 కుక్కలకు రేబిస్ వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసగుప్తా పేర్కొన్నారు. **ఉరవకొండ:** పట్టణంలోని పశువైద్యశాల వద్ద పెంపుడు జంతువులకు యాంటీరేబీస్ టీకాలను వేసినట్లు పశు సంవర్ధకశాఖ ఉరవకొండ డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ వెంకటేశ్ తెలిపారు.

దుర్గం విద్యార్థుల ప్రతిభ

రాయదుర్గం : అనంతపురంలో స్వర్ణాంధ్ర-2024 స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా జరిగిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఆంగ్ల మాధ్యమ వ్యాసరచన పోటీలో ఎం.సాయికీర్తనకు ప్రథమ బహుమతి, ఎన్.రఫియా వక్తృత్వంలో తృతీయ, తెలుగు వక్తృత్వ పోటీలో అమృత తృతీయ బహుమతి సాధించింది.

వైకాపా పాలనలో రూ.7వేల కోట్ల భూకుంభకోణం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో రూ.7వేల కోట్ల భూ కుంభకోణం జరిగిందని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆరోపించారు. పట్టణ సమీపంలోని బీటీపీ లేఅవుట్‌లో శనివారం ఏర్పాటు చేసిన 'మన ఇల్లు.. మన గౌరవం' కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వైకాపా నాయకులు కారుచౌకగా పేదలతో భూములు కొనుగోలు చేసి, వాటిని ఎక్కువ రేట్లకు ప్రభుత్వానికి విక్రయించి రూ.కోట్లు కొల్లగొట్టారన్నారు. రాయదుర్గం పట్టణంలోనే రూ.3కోట్ల దాకా భూ కుంభకోణం జరిగిందని, ఆధారాలు తన వద్ద ఉన్నాయన్నారు. దానిపై విచారణ జరుగుతోందన్నారు. జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళు శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి, హౌసింగ్ డీఈ మోడి రంగస్వామియాదవ్, ఏఈ జయచంద్ర, తహసీల్దార్ నాగరాజు పాల్గొన్నారు.

పెన్నహోబిలంలో మాజీ ఎమ్మెల్యే పూజలు

ఉరవకొండ : తిరుమల లడ్డూను సీఎం చంద్రబాబు అపవిత్రం చేస్తున్నారని వైకాపా మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఆరోపించారు. శనివారం ఆయన వైకాపా శ్రేణులతో కలిసి పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు చేశారు. రాజకీయ దురుద్దేశంతోనే సీఎం ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు.

చిరుత సంచారం

కళ్యాణదుర్గం గ్రామీణం : గూబనపల్లి గ్రామ సమీపంలోని ప్రైవేట్ పాఠశాల పక్కనే ఉన్న కొండలో చిరుత కనిపించింది. శనివారం సాయంత్రం అటుగా వెళ్తున్న వాహనదారులు, ప్రజలు చిరుతను చూసి భయాందోళనకు గురయ్యారు.

విషద్రావణం తాగి ఆవులు మృతి

కుందుర్పి, న్యూస్‌టుడే: మండలంలోని కరిగానిపల్లి గ్రామానికి చెందిన తిప్పేస్వామి రైతుకు చెందిన రెండు ఆవులు శనివారం సాయంత్రం విషద్రావణం తాగి మృతిచెందాయి. గ్రామ సమీపంలోని ఓ పొలం వద్ద ఆవులను మేత కోసం వదలగా విషద్రావణం తాగి అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధిత రైతు విలపించారు. రూ.80వేలు నష్టం వాటిలినట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

అదనపు కోర్టు మంజూరుకు వినతి



హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రీనివాసరెడ్డిని సత్కరిస్తున్న న్యాయవాదులు

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గంలో పెండింగ్ కేసులు ఎక్కువగా ఉన్నాయని, అదనపు కోర్టు మంజూరు చేయాలని స్థానిక కోర్టులోని న్యాయవాదులు దేవేంద్ర, అలెగ్జాండర్, సుదర్శన్, ముత్యాలప్ప, దిలీప్, మనోజ్‌లు హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రీనివాసరెడ్డికి విన్నవించారు. శనివారం అనంతపురం వచ్చిన జడ్జిని వారు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కళ్యాణదుర్గంలో పెండింగ్ కేసులను పరిష్కరించాలని కోరారు.

నేటి నుంచి రాయదుర్గం-ఉరవకొండ బస్సు సర్వీసులు

రాయదుర్గం, న్యూస్‌టుడే: కణేకల్లు-మాల్యం గ్రామాల మధ్య వేదవతి నదిలో కొట్టుకుపోయిన రోడ్డుకు మరమ్మతులు చేసినందున రాయదుర్గం నుంచి ఉరవకొండకు ఆదివారం నుంచి బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజరు సురేష్‌కుమార్ తెలిపారు. శనివారం ఈ రోడ్డుపై ట్రయల్‌రన్ జరిపి లైన్ క్లియర్ చేశారు.

శుద్ధజల ప్లాంట్లు అలంకారప్రాయం

- పాఠశాలల్లో శుద్ధజలానికి ఇక్కట్లు

ఉరవకొండ, వజ్రకరూరు మండలాల్లో బడులు: 108
విద్యార్థుల సంఖ్య: 16,020 ఆర్వో ప్లాంట్లు ఉన్న పాఠశాలలు: 65
పని చేయనివి : 40కి పైగా ఒక్కో ప్లాంటు విలువ: రూ.4లక్షలు

ఉరవకొండ, వజ్రకరూరు, న్యూస్‌టుడే: ఉరవకొండ, వజ్రకరూరు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు అలంకారప్రాయంగా మారాయి. కొన్నిచోట్ల యంత్రాలను బిగించకుండా మూలన పడేశారు. విద్యార్థులకు శుద్ధజలం అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం నాడు-నేడులో భాగంగా ఆర్వో ప్లాంట్లు మంజూరు చేసింది. చాలా పాఠశాలల్లో అవి మరమ్మతులకు గురయ్యాయి. వినియోగంలోకి తీసుకువచ్చే చర్యలు ఎక్కడా కనిపించడం లేదు. కొన్ని పాఠశాలల్లో నీటిని కొనుగోలు చేస్తున్నారు. ఎక్కువ మంది విద్యార్థులు ఇళ్ల నుంచే సీసాల్లో నీరు తెచ్చుకొని దాహం తీర్చుకుంటున్నారు. సమస్యను ఉరవకొండ ఎంఈవో రమాదేవి దృష్టికి తీసుకెళ్లగా మరమ్మతులు చేయించేలా చొరవ చూపుతామన్నారు.



ఉరవకొండ ఎస్కే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 945 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ ఆర్వోప్లాంటు మరమ్మతుకు గురయ్యింది. మెకానిక్ రాకపోవడంతో అది మూలకు చేరింది. విద్యార్థులకు క్యాన్ల ద్వారా నీటిని తెచ్చి పెడుతున్నారు.



● ఈ చిత్రంలోని ఆర్వో ప్లాంటు ఉరవకొండ ఎస్టీ బాలికల గురుకులంలోనిది. ఇక్కడ 227 మంది విద్యార్థినులు ఉన్నారు. ఏడాది కాలంగా యంత్రం పని చేయడం లేదు. ప్రైవేటుగా నీళ్ల క్యాన్లు కొని, విద్యార్థినులకు అందిస్తున్నారు.

ఐదుగురిపై కేసు నమోదు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మల్లికార్జునపల్లి గ్రామంలో మహిళా సంఘాల సొమ్ము రూ.72 లక్షలు స్వాహా చేశారనే ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. వెలుగు కార్యాలయ అధికారుల ఫిర్యాదు మేరకు ఎర్రిస్వామి, లక్ష్మీనరసమ్మ, హనుమంతరాయుడు, వరలక్ష్మీ, లక్ష్మీదేవిపై కేసు నమోదు చేశామన్నారు.

సీఎంను కించపరిచేలా పోస్టు చేశాడని..

సీఎం చంద్రబాబును కించపరిచే విధంగా సామాజిక మాధ్యమంలో పోస్టు పెట్టారని తెదేపా నాయకుడు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమేరకు శెట్టూరుకు చెందిన లక్ష్మణమూర్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అనుమతులు లేకుండా ర్యాలీ చేశారని..

ఎలాంటి అనుమతి లేకుండా ప్రజలకు ఇబ్బంది కలిగించేలా పట్టణంలో ర్యాలీ నిర్వహించిన మాజీ ఎంపీ, నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త తలారి రంగయ్య, నాయకులు తిప్పేస్వామి, ఉమామహేశ్వరనాయుడు, ఫణీంద్రతోపాటు 44 మందిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

మధ్యవర్తిత్వానికి వచ్చి.. గొడవకు దిగి

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: భార్యాభర్తల మధ్య నెలకొన్న సమస్యను పరిష్కరించేందుకు కళ్యాణదుర్గం పట్టణ పోలీసు స్టేషనుకు వచ్చిన మధ్యవర్తులు గొడవ పడ్డారు. దొడగట్ట, ఎర్రంపల్లికి చెందిన భార్యాభర్తల మధ్య వివాదం నెలకొంది. వారి తరపున మధ్యవర్తులు(పెద్ద మనుషులు) పోలీసు స్టేషన్‌కు చేరుకొన్నారు. మాటామాటా పెరిగి ఒకరిపై ఒకరు దూషించుకొంటూ దాడికి దిగారు. ఆ సమయంలో ఏఎస్ఐ ఒక్కరే ఉండటంతో వారిని అదుపు చేయలేకపోయారు. అనంతరం సీఐ ఇరువర్గాలను పిలిపించి సమస్య తెలుసుకొన్నారు. రెండు రోజుల తర్వాత రావాలని చెప్పడంతో వెళ్లిపోయారు.



ఘర్షణ పడుతున్న ఇరువర్గాలు

గుంతకల్లు

●గుంతకల్లు ●శింగనమల ●తాడిపత్రి

ఎమ్మెల్యే ఆరోగ్యం మెరుగుపడాలని పూజలు



బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో తెదేపా కౌన్సిలర్లు

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి గత వారం రోజులుగా చికెన్ గన్యాతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, త్వరగా కోలుకోవాలని తాడిపత్రి తెదేపా కౌన్సిలర్లు బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ ఛైర్మన్ కొంతకాలంగా అనారోగ్యంతో అవస్థలు పడుతున్నాడని ఆయన కోలుకోవాలని పూజలు చేశారు. మున్సిపల్ వైస్‌ఛైర్మన్లు సరస్వతి, అబ్దుల్‌రహీం, కౌన్సిలర్లు రేష్మాపర్వీన్, లక్ష్మీదేవి, అరుణ, రమాదేవి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపిక

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు కొర్రపాడు బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని లహరి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ విజయలక్ష్మి తెలిపారు. ఇటీవల వైజాగ్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో లహరి ప్రతిభ కనపరిచి జాతీయ పోటీలకు ఎంపికైందన్నారు. ఈ సందర్భంగా లహరిని ఉపాధ్యాయులు శ్యామలాదేవి, సరళ, వరలక్ష్మి అభినందించారు.



విద్యార్థిని లహరిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM to 1 PM)
గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 99897 94244

సమస్య: శింగనమల మండలం ఆకులేడులో వీధి దీపాలు వెలగడం లేదు. **- మసూద్‌వలి, ఆకులేడు**

సమాధానం: వీధి దీపాలు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తాం. **- నిర్మలకుమారి, ఎంపీడీవో, శింగనమల**

సమస్య: సరస్వతి విద్యా మందిరం సమీపంలోని కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు ఉండటంతో ఇబ్బందిగా ఉంది. **- ప్రసాద్, స్థానికుడు**

సమాధానం: కాలువలో వ్యర్థాలను తొలగిస్తాం. **- శ్రీధర్, శానిటేషన్ కార్యదర్శి**

– న్యూస్‌టుడే, శింగనమల, గుంతకల్లు పట్టణం

ఆగిన నాడు- నేడు పనులు

➤ అసంపూర్తిగా నిర్మాణాలు ➤ ఇబ్బందుల్లో విద్యార్థులు



గంగానగర్‌లో డీపీఈపీ ప్రాథమిక పాఠశాలలో అసంపూర్తిగా మరుగుదొడ్డి నిర్మాణం

పురపాలకం	గుంతకల్లు
రెండో విడత పాఠశాలల సంఖ్య	16
నిధులు మంజూరు	రూ.2.49 కోట్లు
పూర్తయిన పనులు	75 శాతం

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే

ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మారుస్తామని గత వైకాపా ప్రభుత్వం చేపట్టిన రెండో విడత నాడు-నేడు పనులు నిధులు సకాలంలో విడుదల చేయకపోవడంతో ఎక్కడి అక్కడే ఆగిపోయాయి. గుంతకల్లు పట్టణంలో కొన్ని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలల్లో ఈ పరిస్థితి నెలకొంది. నిర్మాణాలు చివరి దశలో నిలిచిపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు.

★ గంగానగర్‌లో డీపీఈపీ పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణ పనులు గత ప్రభుత్వంలోనే నిలిచిపోయాయి. నిధులు విడతల వారీగా రాకపోవడంతో పనులు మొదలుకాలేదు. శుద్ధి నీటి యంత్రం వచ్చింది కానీ పరికరాలు రాలేదు. మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు ఇంటికి వెళ్లి వస్తున్నారు. ఆవరణలో కంకర, రాళ్లు ఉండటంతో ఆటలు ఆడుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు.

★ పాత గుంతకల్లులో నాగప్ప కాలనీలో మున్సిపల్ దాదాబాయినౌరజి ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్డి నిర్మాణం పూర్తి కాలేదు. విద్యార్థులు పక్కనే ఉన్న పాఠశాలలో మరుగుదొడ్లు ఉపయోగించుకుంటున్నారు.

★ మున్సిపల్ రవీంద్రనాథ్ ఠాగూర్ పాఠశాల ఆవరణలో బండల పరపు చేయలేదు. మరుగుదొడ్లకు టైల్స్ వేయలేదు. ఆర్వో ప్లాంట్ వచ్చింది బిగించలేదు. గత ఏడాది నవంబరులోనే పనులు ఆగిపోయాయి.

★ మున్సిపల్ కందుకూరి వీరేశలింగం పంతులు పాఠశాలలో ప్రహరీ నిర్మాణం ఒకటే జరిగింది. తరగతి గది, వరండాల స్లాబ్‌ల మరమ్మతులు చేయలేదు. విద్యార్థులు ఇంటి నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నారు.

★ పాత గుంతకల్లులో కొనకొండ్ల రోడ్డులో ఉండే డీపీఈపీ పాఠశాలలో మరుగుదొడ్డి నిర్మాణం పూర్తయింది. ఎలక్ట్రికల్ వర్క్స్, నీటి వసతి ఏర్పాటు చేయాల్సి ఉంది.

నిధుల కొరతతోనే సమస్య

- హరికృష్ణ, ఏఈ, గుంతకల్లు

పురపాలక ప్రాథమిక పాఠశాలల్లో రెండో విడత నాడు-నేడు పనులు 75 శాతం పూర్తయ్యాయి. 25 శాతం పనులు జరగాల్సి ఉంది. నిధులు కొరతతో పనులు పూర్తి కాలేదు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పూర్తి చేయడానికి కృషి చేస్తాం.

సంక్షిప్త సమాచారం

మైనింగ్ ఏడీగా ఓబుళరెడ్డి బాధ్యతలు

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రి మైనింగ్ ఏడీగా ఓబుళరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న నాగయ్య నరసరావుపేటకు బదిలీపై వెళ్లగా, ఆయన స్థానంలో మార్కాపురం నుంచి ఆయన వచ్చినట్లు తెలిపారు. తాడిపత్రి పరిధిలో శాఖపరంగా ఉన్న పలు విషయాలపై సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

విద్యార్థిని అదృశ్యం

యల్లనూరు, న్యూస్‌టుడే: మండలంలోని దంతలపల్లెకు చెందిన హేమ తాడిపత్రిలోని టెక్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. స్వగ్రామంలోని తల్లి వద్దకు వచ్చి కనిపించకుండా అదృశ్యమైంది. ఈ విషయమై శనివారం విద్యార్థిని తల్లి పోలీసులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాంప్రసాద్ తెలిపారు.

మట్కా నిర్వాహకుడిపై..

గుంతకల్లు పట్టణం: గుంతకల్లు పట్టణంలో ఆన్‌లైన్ మట్కా నిర్వహిస్తున్న రామాంజనేయులును శనివారం అదుపులోకి తీసుకున్నట్లు రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ ఏబీ మస్తాన్ తెలిపారు. క్రౌన్ టాకీస్ వీధిలో నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించారు. అతని వద్ద నుంచి రూ.4,150 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామన్నారు.

అత్యాచారం కేసులో నిందితుడికి రిమాండ్

పెద్దపప్పూరు, న్యూస్‌టుడే: అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని శనివారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పెద్దపప్పూరు మండలంలోని ఓ గ్రామంలో మైనర్ బాలికపై పెదనాన్న కుమారుడు అత్యాచారానికి పాల్పడిన ఘటనపై బాలిక ఫిర్యాదు మేరకు ఈనెల 26న పెద్దపప్పూరు పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ గౌస్‌బాషా తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన అవసరమని సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు వంశీకృష్ణ, అశోక్ తెలిపారు. వీసీ కోరి ఆదేశాల మేరకు జంతులూరు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై శనివారం అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు వేలిముద్రలు, ఆధార్, ఏటీఎం కార్డులతో ప్రజల బ్యాంకు ఖాతాల్లో నగదును కాజేస్తున్నారన్నారు. ఆధాకార్డు, బ్యాంకు ఖాతా వివరాలు ఎవరికీ చెప్పకూడదన్నారు. ఈ విషయాలను విద్యార్థులు తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు.

'తప్పులు చేసి విమర్శించడం సరికాదు'



సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్, తెదేపా నాయకులు

గుంతకల్లు, న్యూస్‌టుడే: తప్పులు చేసి వాటిని కప్పిపుచ్చుకోవడానికి వైకాపా నాయకులు కూటమి నాయకులపై విమర్శలు చేయడం మంచిదికాదని తెదేపా పట్టణాధ్యక్షుడు ఆనంద్, బీసీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు మస్తాన్‌యాదవ్, తెదేపా లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణారెడ్డి అన్నారు. శనివారం సాయినగర్‌లో విలేకరులతో మాట్లాడారు. తిరుమల ఆలయానికి కల్తీ నెయ్యిని అందించిన వైకాపా ప్రభుత్వం, దీన్ని అంగీకరించకుండా పార్టీ సూచన మేరకు స్థానిక నాయకులు రాజేంద్రనగర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. తెదేపా నాయకులు కల్తీ కల్గిన వారని, అధికార పార్టీకి చెందిన వారు గాడిదలని సంబోధించడం మున్సిపల్ ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డికి తగదన్నారు. వైకాపా హయాంలో పలు పనులకు భూమిపూజలు చేసినా పనులు ప్రారంభం కాక శిలాఫలకాలు వెక్కిరిస్తున్నాయని వివరించారు. నాయకులు అంజి, మస్తానప్ప, హనుమంతు, ఫజులు, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోండి



గుంతకల్లు: మాట్లాడుతున్న ప్రాజెక్ట్ డైరెక్టర్ శైలజ

గుంతకల్లు, శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాల్లో శనివారం 'మన ఇళ్లు - మన గౌరవం' కార్యక్రమాలు జరిగాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఇంటి నిర్మాణాలు వచ్చే మార్చిలోగా పూర్తి చేయాలని గృహ నిర్మాణ సంస్థ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ శైలజ తెలిపారు. ఆయా మండలాల్లో సంబంధిత అధికారులు లబ్ధిదారులతో సమావేశమై వివరాలు ఆరా తీశారు. గత తెదేపా ప్రభుత్వంలో ఆగిన ఇళ్లను పూర్తి చేసుకుంటే బిల్లులు చెల్లిస్తామన్నారు. ప్రస్తుతం ఇళ్లు పూర్తికాని లబ్ధిదారులు వెంటనే నిర్మించుకోవాలని, లేనిపక్షంలో బిల్లులు చెల్లింపుతో పాటు స్థలాలను రద్దు చేస్తామని సూచించారు. **- న్యూస్‌టుడే, బృందం**

వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

గుత్తి, న్యూస్‌టుడే: స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం జనసేన, తెదేపా నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యిని వాడటంపై ప్రసాదాన్ని అపవిత్రం చేశారని స్వామికి ప్రత్యేక పూజలతో పాటు హోమాన్ని నిర్వహించారు. తెదేపా నాయకుడు గుమ్మనూరు నారాయణ, జనసేన నాయకుడు పాటిల్‌సురేశ్ పాల్గొన్నారు.

శ్మశాన వాటికల్లో సౌకర్యాలకు వినతి

యాడికి, న్యూస్‌టుడే: యాడికి పట్టణంలోని పలు శ్మశాన వాటికల్లో సదుపాయాలు కల్పించాలని మే ఐహెల్ప్‌యూ స్వచ్ఛంద సంస్థ సభ్యులు అధికారులను కోరారు. ముళ్ల పొదలు, ఇనుప చువ్వలు, గాజు వడకలు తదితర వ్యర్థ పదార్థాలతో అంత్యక్రియలకు వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. కోనరోడ్డులోని శ్మశాన వాటిక తీవ్ర అసౌకర్యంగా మారిందని, ప్రహరీ నిర్మాణం కోసం చర్యలు తీసుకోవాలన్నారు. ఉప తహసీల్దార్ శ్రీనివాసులు, సీఐ ఈరణ్ణలకు శనివారం వినతిపత్రాలు అందజేశారు. సంస్థ సభ్యులు బాలకృష్ణ, రామమోహన్, చంద్రశేఖర్‌రెడ్డి, నాగరాజు, నరసింహ, ధనుంజయ, శంకరప్ప పాల్గొన్నారు.

వేరుసెనగ పంటకోత ప్రయోగం

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: గార్లదిన్నె గ్రామానికి చెందిన రైతు రాజేశ్వరి పొలంలో శనివారం పంటకోత ప్రయోగం నిర్వహించారు. సర్వే నెంబరు 294-3లో ప్రయోగం చేయగా 1.920 కిలోల దిగుబడి రాగా, ఎకరానికి 4 నుంచి 5 బస్తాలు దిగుబడి రానున్నట్లు ఏవో సోమశేఖర్ తెలిపారు. ఏఎస్‌వో రాజ్యలక్ష్మి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలి

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లు ప్రాంతీయ ఆస్పత్రిలో సమస్యలను పరిష్కారించాలని భాజపా నాయకులు సూపరింటెండెంట్ అజెంద్రరావును కోరారు. గుంతకల్లు ప్రాంతీయ ఆస్పత్రిలో మందుల్లేవ్ అనే శీర్షికన శనివారం 'ఈనాడు' దినపత్రికలో కథనం ప్రచురితమైంది. భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, పట్టణాధ్యక్షుడు రమేష్, అసెంబ్లీ కన్వీనర్ కృష్ణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్, రాష్ట్ర మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి స్పందించారు. సూపరింటెండెంట్, సీనియర్ వైద్యులును కలిసి సమస్యలపై చర్చించారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కోరారు. వైద్యులు, సిబ్బంది, మందుల కొరత ఉందని, జిల్లా స్థాయి ఆస్పత్రి చేయాలని ప్రతిపాదనలో ఉందని సూపరింటెండెంట్ తెలిపారు. సమస్యను రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం దృష్టికి తీసుకెళ్తామన్నారు.



వైద్య సిబ్బందిని కలిసిన భాజపా నాయకులు

రాకపోకలు సాగించేదెలా?



శింగనమల మండలం నిదనవాడ- తరిమెల గ్రామాల మధ్య రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు ఏపుగా పెరిగాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయంగా మారింది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. గత ఐదేళ్లుగా ముళ్లపొదలను తొలగించక పోవడంతో వాహన చోదకులు నానా అవస్థలు పడుతున్నారు. రాత్రిళ్లు రోడ్డు ప్రమాదలు చోటు చేసుకుంటున్నాయని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, శింగనమల

కుళాయి గుంతతో జాగ్రత్త..!

గుంతకల్లు పట్టణంలోని భాగ్యనగర్‌లోని ఈద్గా మసీదుకు వెళ్లే రహదారిలో కుళాయి గుంత ప్రమాదకరంగా ఉంది. రోడ్డు మధ్యలో ఉండటంతో వాహన చోదకులు నానా అవస్థలు పడుతున్నారు. గుంత వెడల్పు కావడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. రాత్రిళ్లు వాహన చోదకులు కిందపడి గాయాల పాలవుతున్నారు. గుంతకు సిమెంట్‌తో ప్లాసింగ్ చేయాలని ప్రజలు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం**



రైతు కుటుంబానికి అండగా నిలుస్తాం



ఆర్డీవోకు సమస్యను తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

గార్లదిన్నె, న్యూస్‌టుడే: మండలంలోని క్రిష్ణాపురానికి చెందిన రైతు సూర్యనారాయణ మూడురోజుల కిందట పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషయం విధితమే. బూదేడు గ్రామ సమీపంలోని పొలానికి పట్టాల మంజూరు, ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడం వల్ల ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైతు కుటుంబానికి న్యాయం చేయాలని శనివారం అనంతపురం ఆర్డీవో వసంతకుమార్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. మృతుడు సూర్యానారయణ సోదురులు, కుమారులను కార్యాలయానికి పిలిపించి సాగులో ఉన్న భూమిలో ఎకరా పొలాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తహసీల్దార్ ఈరమ్మకు సూచించారు. రైతు సంఘాల నాయకులు నాగరాజు, చెన్నారెడ్డి తదితరులు ఎకరా పొలం కాకుండా సంవత్సరాల నుంచి సాగుచేస్తున్న మొత్తం 1.54సెంట్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసి పట్టాదారు పాసుపుస్తకం ఇచ్చి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. విచారించి చేస్తామని ఆర్డీవో తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ బధిరుల వారోత్సవం



బధిర విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: అంతర్జాతీయ బధిరుల వారోత్సవాలను స్థానిక ఆర్డీటీ బధిరుల పాఠశాల విద్యార్థులు శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ఎర్రిస్వామి ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శన నిర్వహించి ఫాదర్‌ఫెర్రర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళుర్పించారు. ఆర్డీటీ ఆడిటోరియంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎంపీడీవో తేజోత్స్న బధిర విద్యార్థుల్లో అపారమైన ప్రతిభ దాగి ఉందన్నారు.

ప్రశాంతంగా జీవించండి: డీఎస్పీ



క్రిష్టిపాడులో ప్రజలతో చర్చిస్తున్న డీఎస్పీ రామకృష్ణుడు

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: మండలంలోని ఫ్యాక్షన్ గ్రామాలైన అప్పేచెర్ల, క్రిష్టిపాడులో శనివారం తాడిపత్రి డీఎస్పీ రామకృష్ణుడు పర్యటించారు. ఆయా గ్రామాల ప్రజలతో సమావేశమై ప్రస్తుత పరిస్థితులపై చర్చించారు. ఎవరూ గొడవలకు పాల్పడకుండా ప్రశాంతంగా జీవనాన్ని సాగించాలన్నారు. పిల్లల్ని బాగా చదివించుకుని ఉన్నతంగా ఉండాలన్నారు. ఇదివరకు జరిగిన ఘటనలపై ఆరా తీశారు. ఆయన వెంట ఎస్ఐ చిన్నరెడ్డెప్ప, సిబ్బంది ఉన్నారు.

పెద్దపప్పూరు: గొడవలు మాని ప్రశాంతంగా జీవించాలని సీఐ రామ సుబ్బయ్య సూచించారు. మండలంలోని ముచ్చుకోట, వరదాయపల్లి గ్రామాల్లో శనివారం గ్రామ సభలు నిర్వహించారు. ఐకమత్యంతో మెలిగి వివాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ గౌస్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గుర్రం జాషువా జయంతి



గుత్తి: జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పెన్షనర్లు

గుంతకల్లు, న్యూస్‌టుడే: భారతి సాహితీ సమితి ఆధ్వర్యంలో శనివారం మండిబజార్‌లో కవి గుర్రం జాషువా జయంతిని ఘనంగా నిర్వహించారు. సమితి అధ్యక్షుడు రాముడు, ప్రచార కార్యదర్శి గంగరాజులు మాట్లాడుతూ.. గుర్రం జాషువా ఎన్నో కావ్యాలు, గ్రంథాలను రాసి ప్రత్యేకతను చాటుకున్నారన్నారు. అనంతరం సేవారత్న అవార్డులు అందుకున్న మల్లికార్జున, బెంజిమెన్‌లను సత్కరించారు. చంద్రశేఖర్, లక్ష్మీపతి, ఆంథోని, మల్లికార్జున, ప్రభావతి, విశ్వనాథ్, సుధాకర్, శ్రీధరన్, దివాకర్ శాస్త్రి పాల్గొన్నారు.

గుత్తి: గుత్తిలోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు గుర్రం జాషువా జయంతిని నిర్వహించారు. స్థానిక పెన్షనర్ల అసోసియేషన్ తాలూకా కార్యాలయంలో జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుళ్లాయిబాబు, స్వర్ణాంబ, ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయాలు కొనసాగిద్దాం



తాడిపత్రి: భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కౌన్సిలర్, సచివాలయ సిబ్బంది

తాడిపత్రి, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య పోరాట యోధుడు భగత్‌సింగ్ జయంతిని పట్టణంలోని భగత్‌సింగ్ నగర్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వార్డు కౌన్సిలర్ మల్లికార్జున, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి: గుత్తిలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి నిర్వహించారు. ఎన్టీఆర్ కూడలిలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేశ్, రవి, నవీన్, బాలు పాల్గొన్నారు.

యాడికి: యాడికి మండలం రాయలచెరువులో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి నిర్వహించారు. చల్లా సూర్యనారాయణ, రవికుమార్ రెడ్డి, రవిప్రసాద్, సత్యనారాయణ, కులశేఖర్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

గుంతకల్లు పట్టణం: భగత్‌సింగ్ జయంతిని విద్యార్థి సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు సురేంద్ర, వెంకటేశులు ర్యాలీగా వెళ్లి భగత్ సింగ్ విగ్రహానికి నివాళులర్పించారు.

ప్లాస్టిక్ కవర్లు ఉపయోగించొద్దు

బుక్కరాయసముద్రం: ప్లాస్టిక్ కవర్ల నిషేధానికి గ్రామాల్లో ప్రజలు సహకరించాలని ఎంపీడీవో తేజోత్స్న కోరారు. శనివారం బుక్కరాయసముద్రంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్‌లో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. ప్రజలు ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈవోఆర్డీ దామోదరమ్మ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

పామిడి: 2024-25 విద్యా సంవత్సరానికి ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన పామిడి మండలానికి చెందిన ఉపాధ్యాయులను శనివారం ఘనంగా సన్మానించారు. నాగిరెడ్డికాలనీలోని ఎంపీయూపీ పాఠశాల రామగిరిలో పనిచేసే రఫీహుద్దీన్, పట్టణంలోని 1వ వార్డు పాఠశాలలో పనిచేసే రంగనాథం, నాగిరెడ్డి కాలనీలోని పాఠశాలలో పనిచేసే రాణిసంయుక్తను సత్కరించారు. ఉపాధ్యాయులు నాగభూషణం, రామకృష్ణ, శ్రీనివాసులు, రామాంజనేయులు, చంద్రశేఖర్, కుళ్లాయప్ప పాల్గొన్నారు.

కొత్త ఆలోచనలు..

అద్భుత ఆవిష్కరణలు

వైజ్ఞానిక నమూనాలతో విద్యార్థుల సత్తా



జాతీయ పోటీలకు ఎంపికైన నమూనాలతో బన్నీ, మహేంద్రరెడ్డి

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తి కోటలోని కేశవపిళ్లై ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు కొత్త ఆలోచనలతో అద్భుతాలను సృష్టిస్తున్నారు. 2017 నుంచి తక్కువ ఖర్చుతో వైజ్ఞానిక నమూనాలను రూపొందిస్తూ అబ్బురపరుస్తున్నారు. సైన్స్ ఉపాధ్యాయ బృందం సహకారంతో నమూనాలను తయారు చేస్తూ.. చదువుతో పాటు వైజ్ఞానిక ప్రదర్శనలో సత్తా చాటుకుంటున్నారు.

★ గత ఏడాది పదో తరగతి చదువుతున్న బన్నీ, మహేంద్రరెడ్డిలు కవచ్ టెక్నాలజీ, రైల్వే లైట్స్ బై బ్లూటూత్ పేరుతో రైలు ప్రమాదాల నివారణపై నమూనాను రూపొందించారు. ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదంపై వారు కలత చెందారు. ఒకే ట్రాక్‌పై ఎదురెదురుగా రైళ్లు వస్తే ఎలా ప్రమాదాన్ని నివారించాలో నమూనాను తయారు చేశారు.

★ ఒకే రైలు మార్గంలో రెండు రైళ్లు వస్తే ఆల్ట్రా సోనిక్ సెన్సార్ల ద్వారా ఇంజిన్లలోని డ్రైవర్లకు 500 మీటర్ల దూరంలోనే శాటిలైట్ ద్వారా సిగ్నల్స్ అందుతాయి. ఆటోమేటిక్‌గా రైళ్లకు బ్రేకులు పడతాయి. ఈ నమూనా విజయవాడలో నిర్వహించిన జవహర్‌లాల్ నెహ్రూ కాంగ్రెస్ జాతీయ స్థాయి ప్రదర్శనకు ఎంపికైంది.

★ జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో బహుమతులు సాధించారు. పలు నమూనాలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. 2023లో కౌశల్, బన్నీ అనే విద్యార్థులు ఆవిష్కరించిన పోస్టర్ ప్రజెంటేషన్ రాష్ట్ర స్థాయి బహుమతిని సాధించింది.

మనిదీప్ ఇన్నోవేటివ్ బ్యాగ్ పేరుతో నమూనాను రూపొందించి రాష్ట్ర స్థాయి బహుమతిని పొందారు. 2021లో కాయిన్ బేస్డ్ పోలార్ మొబైల్ ఛార్జ్ నమూనాను రూపొందించి రాష్ట్ర స్థాయి పోటీలో ప్రదర్శించారు. ఇలా పాఠశాలకు చెందిన విద్యార్థులు గత ఏడాది 300 ప్రాజెక్టులను తయారు చేశారు.

★ గత ఏడాది నమూనాల తయారీకి పూర్వ విద్యార్థులు, ఎస్ఐలు ఐదుగురు రూ.75 వేలు విరాళంగా ఇచ్చారు. అటల్ టింకరింగ్ ప్రయోగశాలలో విద్యార్థులు ల్యాప్‌టాప్స్ ద్వారా కోడింగ్ చేసుకుంటూ నమూనాలను రూపొందిస్తున్నారు. ఉత్తమ నమూనాలతో విద్యార్థులు అందరి ప్రశంసలు పొందుతున్నారు.

నిద్రపోతున్న నిఘా నేత్రం

మరమ్మతులకు నోచుకోని సీసీ కెమెరాలు



కోనరోడ్డులో నిరుపయోగంగా సీసీ కెమెరాలు

యాడికి, న్యూస్‌టుడే: నేర పరిశోధన, శాంతి భద్రతల పరిరక్షణ తదితర కీలక అంశాలపై నిత్యం నిఘా ఉంచే సీసీ కెమెరాలు యాడికిలో ప్రస్తుతం నిద్రపోతున్నాయి. జన సందోహం, ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారులు, వ్యాపార సముదాయాలు వంటి చోట్ల రూ.లక్షలు పోసి ఏర్పాటు చేసిన కెమెరాలు పని చేయడం లేదు.

★ మండల వ్యాప్తంగా 97 ఉండగా 50 శాతం వరకు పని చేయడం లేదు. 24 గంటలు నిఘా ఉంచి కీలకపాత్ర పోషించే కెమెరాలపై పోలీసులు నిఘా పెట్టడం లేదు. కోనరోడ్డు కూడలి, ప్రధాన రథం, పాత పోలీస్‌స్టేషన్, రాయలచెరువులోని చందన రోడ్డు వద్ద సీసీ కెమెరాలు పని చేయడం లేదు.

★ పోలీసు శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న 32 కెమెరాలు నిరుపయోగంగా మారాయి. మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

నిఘాతో వాహనాల పట్టివేత..

మండలంలో దాదాపు 15 కి.మీ. మేరకు 67వ జాతీయ రహదారి ఉంది. ఇక్కడ వాహనాలు ఢీకొని వెళ్లిపోగా పలువురు మృత్యువాతన పడ్డారు. కెమెరాల్లో వాహనాల నెంబర్ల ఆధారంగా కేసులు నమోదు చేసిన దాఖలాలు ఉన్నాయి. స్థానిక వస్త్ర దుకాణంలో ఓ వ్యక్తి చీరలను చోరీ చేస్తుండగా సీసీ కెమెరాల ద్వారా పట్టుకున్నారు. కుంట వీధిలో మందుబాబులు హల్‌చల్ చేస్తుండగా పోలీసులు కెమెరాల్లో చూసి అక్కడికి చేరుకుని అదుపులోకి తీసుకున్నారు.

పని చేసేలా చేస్తాం

- ఎం.ఈరణ్ణ, సీఐ, యాడికి

పని చేయని సీసీ కెమెరాలను పరిశీలించి మరమ్మతులు చేసేందుకు కృషి చేస్తున్నాం. ముఖ్యంగా వ్యాపార సంస్థలు, చిన్న పరిశ్రమల యజమానులు వారి సముదాయాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పిస్తాం. ప్రత్యేక నిఘా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. శాంతిభద్రతలను కాపాడుతాం.

మధుర ఫలం.. ఆరోగ్యం.. ఆదాయం


రాయదుర్గం, న్యూస్‌టుడే: తేనె లాంటి తియ్యదనం.. ఆరోగ్య ప్రదాయిని సీతాఫలాల విక్రయాలు రాయదుర్గం మార్కెట్లో ఊపందుకున్నాయి. కొండలు, గుట్టలు, అడవుల్లో వర్షాధారంగా లభించే ఈ మధుర ఫలాలు వేల మంది రైతులు, కూలీలకు ఉపాధినిస్తున్నాయి. పలువురు రైతులు తోటల్లో అంతర పంటగా సాగు చేసి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి పొందుతున్నారు.

ఆశాజనకంగా దిగుబడి

ఈ ఏడాది వర్షాలు బాగా కురవటంతో ఆశించిన మేర దిగుబడి వచ్చింది. రోజూ టన్నులకొద్దీ సీతాఫలాలు లభిస్తున్నాయి. ఈ లెక్కన సీజన్(సెప్టెంబరు నుంచి డిసెంబరు) వరకు దాదాపు వంద టన్నుల దిగుబడి రావచ్చని రైతులు చెబుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో లభించే సీతాఫలాల కన్నా.. ఇక్కడి ఫలాలు మధురంగా ఉంటాయి. రాయదుర్గం కొండల్లో మేలురకం సీతాఫలాలు లభిస్తున్నట్లు గతంలోనే ఆచార్య ఎన్‌జి.రంగా వ్యవసాయ, ఉద్యాన శాస్త్రవేత్తలు గుర్తించారు.

పరిమాణం మేరకు ధర

గంపల్లో తెచ్చిన వంద సీతాఫలాలను రూ.250 నుంచి రూ.500 దాకా విక్రయిస్తున్నారు. పరిమాణం, నాణ్యతను బట్టి కిలో రూ.60- రూ.80 దాకా ధర పలుకుతోంది. ఇక్కడి నుంచి బెంగళూరు, అనంతపురం, బళ్లారి, దావణగెరె, శివమొగ్గ, హాసన్, చెళ్లకెర తదితర ప్రాంతాలకు వ్యాపారులు ఎగుమతి చేస్తున్నారు.





సీతాఫలాల విక్రయాలు

వెయ్యి కుటుంబాలకుపైగా ఉపాధి

రాయదుర్గం మండలంలోని మెచ్చిరి, పైతోట, కొండలు, గుమ్మఘట్ట మండలం శిరిగేదొడ్డి తదితర ప్రాంతాల్లో సీతాఫలాలు లభిస్తాయి. వాటి విక్రయాలతో వెయ్యి కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి. ఆ చెట్లు ఉండే కొండను ఏటా రూ.50వేలకు వాల్మీకి సంఘం నాయకులు పొంది సబ్‌లీజుకు ఇస్తుంటారు. వన సంరక్షణ సమితుల ఆధ్వర్యంలో రైతులు చెట్లను కొనుగోలు చేసి సీతాఫలాలను పట్టణంలో విక్రయిస్తుంటారు.

మార్కెట్ సౌకర్యం కల్పించాలి



ఈ ఏడాది పంట దిగుబడి ఆశాజనకంగా ఉంది. మూడు నెలల పాటు రైతులు, వ్యవసాయ కూలీలు, వీధి వ్యాపారులకు ఉపాధి లభిస్తుంది. అటవీశాఖాధికారులు సీతాఫలం చెట్లను విరివిగా పెంచాలి. మార్కెట్ సౌకర్యం కలిస్తే మరింత ఆదాయం సమకూరనుంది. **- తిప్పేస్వామి, రాయదుర్గం**

ఫ్లాష్.. ఫ్లాష్.. ఫ్లాష్

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

◆ రెండు వాహనాల ఢీ ◆ 10 మందికి తీవ్ర గాయాలు ◆ ముగ్గురి పరిస్థితి విషమం
◆ క్షతగాత్రులను అనంతపురం ఆసుపత్రికి తరలింపు

గార్లదిన్నె, న్యూస్‌టుడే: బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఏపీఎం ట్రావెల్ బస్సు, ఇదే మార్గంలో మహబూబ్‌నగర్ జిల్లా కొత్తకోటకు వెళ్తున్న ఐచర్ వాహనం శనివారం అర్ధరాత్రి దాటాక 2.30 గంటల ప్రాంతంలో జాతీయ రహదారి 44పై గార్లదిన్నె మండలం కలగాసపల్లి వద్ద ఢీకొన్నాయి. ఈ ఘటనలో 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో బస్సు క్లీనర్, ఇద్దరు కూలీల పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారు తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్‌కు చెందిన కూలీలు. ఈ ఘటనతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. ఎస్ఐ గౌస్ బాషా, పోలీసు సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. రాకపోకలు సాఫీగా జరిగేలా పర్యవేక్షించారు.



గార్లదిన్నె మండలం కలగాసపల్లి వద్ద జాతీయ రహదారిపై ప్రమాద దృశ్యాలు



దిల్లీలో రాజముద్రతో కూడిన పట్టువస్త్రాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్రజౌళిశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్

ధర్మవరం చేనేత వస్త్రంపై రాజముద్ర

ధర్మవరం, న్యూస్‌టుడే: హిందీ పక్షం పురస్కరించుకొని ధర్మవరం చేనేత కార్మికుడు, డిజైనర్ జుజూరు నాగరాజు రూపొందించిన హిందీ దేశ గర్వం అనే నినాదం, భారత రాజముద్ర డిజైన్‌తో కూడిన పట్టువస్త్రాన్ని శనివారం దిల్లీలో కేంద్రజౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ ఆవిష్కరించారు. విజయవాడ చేనేత సేవాకేంద్రం సహకారంతో డిజైనర్ నాగరాజు పట్టు, బంగారు జరీ పోగులను ఉపయోగించి పట్టువస్త్రంపై చేతితో డిజైన్ వేశారు. వస్త్ర తయారీలో చేనేత కార్మికుడు సురేంద్ర బాబు, రాఘవ సహాయపడ్డారని నాగరాజు తెలిపారు.

బీఈడీ కళాశాలలో తాత్కాలిక బోధన ఉద్యోగాలు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని బీఈడీ కళాశాలలో తాత్కాలిక బోధన ఉద్యోగాలు (అకడమిక్ కన్సల్టెంట్) భర్తీ చేస్తున్నట్లు ప్రిన్సిపల్ సోమశేఖర్ తెలిపారు. ఫిజికల్ సైన్స్ మెథడాలజీ, ఎంఈడీ, పీహెచ్‌డీ, నెట్ ఉన్నవారు ఉద్యోగాలకు అర్హులు. ఈ నెల 30న నేరుగా వాక్‌ఇన్‌ఇంటర్వ్యూకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.





సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.



రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

మరిన్ని వివరాలకు.. www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

లడ్డూ తయారీలో కల్తీ నెయ్యిపై జగన్ క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో తిరుమల వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యిని సరఫరా చేసి భక్తుల మనోభావాలు దెబ్బతీశారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం ధర్మవరం పట్టణంలో తన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. కమీషన్లకు కక్కుర్తి పడే నాసిరకం నెయ్యి సరఫరా చేశారన్నారు. అప్పటి సీఎంగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి బంధుప్రీతితో వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డిని తి.తి.దే ఛైర్మన్లుగా, అనుకూలంగా ఉన్న అధికారి ధర్మారెడ్డిని ఈవోగా నియమించారని ఆరోపించారు. చేసిన తప్పులు ఒప్పుకొని జగన్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. గత ఐదేళ్లలో తిరుమల పవిత్రతను తగ్గించే విధంగా జగన్ వ్యవహరించారని విమర్శించారు. దళితులను అన్యమతస్థులుగా జగన్ చిత్రీకరిస్తూ మాట్లాడుతుండటం వారిని అవమానించడమేనన్నారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో నాసిరకం నెయ్యి వినియోగంపై సరైన విచారణ జరుగుతుందని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు ఉంటాయని వివరించారు.

మద్దతు ధరతో పత్తి కొనుగోలు

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా జిల్లా మార్కెటింగ్‌శాఖ సహకారంతో జిల్లాలో గుత్తి, తాడిపత్రి వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, ప్రభుత్వ మద్దతు ధరతో పత్తిని కొనుగోలు చేయడం జరుగుతుందని మార్కెటింగ్‌శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు రామాంజనేయులు (కడప), జిల్లా సహాయ సంచాలకులు సత్యనారాయణ చౌదరి తెలిపారు. పొడవు పింజ పత్తి క్వింటాలు రూ.7,521, పొట్టిపింజ పత్తి క్వింటాలు రూ.7,121 చొప్పున కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతు సేవా కేంద్రాల్లో పత్తి రైతులు సీఎం యాప్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని వారు కోరారు. రైతులు పత్తిని ఆరబెట్టి దుమ్ము, ధూళి లేకుండా శుభ్రపరిచి కేంద్రాలకు తీసుకురావాలన్నారు. ప్లాస్టిక్ సంచులు వినియోగించరాదన్నారు. తేమ 8 శాతం ఉంటే పూర్తి మద్దతు ధర లభిస్తోందన్నారు. అంతకంటే తక్కువ ఉంటే ప్రతి ఒక్క శాతానికి రూ.75.21 పైసలూ కనీస మద్దతు ధర కంటే తగ్గుతుందన్నారు.

● కర్నూలు జిల్లాలోని ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, పెంచికలపాడు వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని మార్కెటింగ్‌శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు రామాంజనేయులు తెలిపారు.

గడువులోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తవ్వాలి



మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, పీడీ శైలజ, డిప్యూటీ కమిషనరు వెంకటేశ్వర్లు

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లావ్యాప్తంగా ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేసుకోవాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సూచించారు. శనివారం లబ్ధిదారులకు నిర్వహించిన అవగాహన సదస్సులు సందడిగా సాగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే అనంతపురం జిల్లాలో ఇప్పటి వరకు 1,945 ఇళ్లను పూర్తి చేశారు. మరింత వేగంగా ఇళ్లను పూర్తి చేయాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం మన ఇళ్లు-మన గౌరవం పేరుతో గృహ నిర్మాణ లబ్ధిదారులతో అవగాహన సదస్సులు చేపట్టినట్లు తెలిపారు. అనంతపురంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ హాజరై మాట్లాడారు.

'ప్రభుత్వమే మద్యం విక్రయించాలి'

కమలానగర్ : రాష్ట్ర ప్రభుత్వం అక్టోబరు 1 నుంచి ప్రవేశపెడుతున్న నూతన మద్యం పాలసీని ఉపసంహరించుకోవాలని, మద్యం విక్రయాలు ప్రభుత్వమే చేయాలని పలు ప్రజా, కార్మిక సంఘాల నేతలు పేర్కొన్నారు. శనివారం ఎన్జీవో సమావేశ భవనంలో నూతన మద్యం పాలసీని వ్యతిరేకిస్తు మద్యం ఆదాయ వనరా? ప్రజా సంక్షేమమా? అనే అంశంపై ఐద్వా ఆధ్వర్యంలో చర్చ వేదిక నిర్వహించారు. ఈ వేదికకు 5వ రాష్ట్ర కోశాధికారి సావిత్రి, రెడ్స్ సంస్థ అధ్యక్షురాలు భానుజా, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు శ్రీవల్లి, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పార్వతి, ప్రగతిశీల మహిళా సంఘం అధ్యక్షురాలు సరస్వతి, కేపీఎస్ నల్లప్ప, ఆవాజ్ వలి, వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణమూర్తి పాల్గొని మాట్లాడారు. మద్యం వల్ల మహిళలు నష్టపోతున్నారన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించుకోవాలన్నారు.

జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్ బాధ్యతల స్వీకరణ

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: అనంతపురం అర్బన్ జాయింట్-1 సబ్‌రిజిస్ట్రార్‌గా రమణరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ధర్మవరం సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ఆయన్ను ఇక్కడికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జాయింట్-2 సబ్‌రిజిస్ట్రార్ యూనస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. గతంలో రమణరావు కర్నూలు డీఐజీ కార్యాలయంలో, రాయలసీమలోని వివిధ జిల్లాల్లో సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేశారు. సబ్‌రిజిస్ట్రార్ యూనస్, ఇతర సిబ్బంది, దస్తావేజుల సంఘం రాష్ట్ర నాయకుడు డి.సుధాకర్, ఇతర సభ్యులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

క్రైస్తవ భవన్‌కు రూ.10 కోట్లు మంజూరు



స్వామిదాస్

అనంతపురం (కళ్యాణదుర్గం రోడ్డు), న్యూస్‌టుడే : అసంపూర్తిగా ఆగిన క్రైస్తవ భవన్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్లు నిధులు కేటాయించడంపట్ల క్రిష్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం అనంతపురం అర్బన్ తెదేపా కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ 2014-19 మధ్య అప్పటి తెదేపా ప్రభుత్వం క్రైస్తవ భవన్‌కు రెండెకరాలు కేటాయించి రూ.16 కోట్లు నిధులు కూడా విడుదల చేయడం జరిగిందన్నారు. ఐదేళ్లుగా వైకాపా ప్రభుత్వం రాగానే పనులు పూర్తి నిలిచి పోయాయన్నారు. క్రైస్తవుల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు ఉదారత చూపి రూ.10 కోట్లు నిధులు విడుదల చేశారన్నారు. రాష్ట్రంలో క్రైస్తవ కార్పొరేషన్ కూడా నిర్వీర్యం చేశారని గుర్తు చేశారు. జెరూసలేం యాత్రకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు.

జల్సాలు, సెల్‌ఫోన్‌పై మోజుతో చోరీల బాట

● ఇద్దరు బాలలు అదుపులోకి..



స్వాధీనం చేసుకున్న బంగారు కడ్డీ, కెమెరా, చరవాణులు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం నగరంలో పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడిన ఇద్దరు బాలలను నాలుగో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.ఆరు లక్షలు విలువ చేసే 7 తులాల బంగారు కడ్డీ, ద్విచక్ర వాహనం, ఐఫోన్, కెమెరా, ఇతర సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల పట్టణానికి చెందిన ఇద్దరు బాలలు ఈ ఏడాది ఆగస్టు చివరి వారంలో తపోవనంలో ఓ ఇంట్లోకి ప్రవేశించి బంగారు, వెండి ఆభరణాలను చోరీ చేశారు. స్థానిక చంద్రబాబు కొట్టాలలోని ఓ ఫొటో స్టూడియో షట్టర్ ధ్వంసం చేసి అందులోని ఖరీదైన కెమెరా, బ్యాటరీ ఇతర సామగ్రిని, పామిడిలో మెడికల్ స్టోర్‌లో ఎలక్ట్రిక్ స్టార్టర్ పెట్టె, నగదు దొంగలించారు. వరుస చోరీలకు పాల్పడటంతో పోలీసులు దృష్టి సారించారు. నగరంలో చోరీల ప్రయత్నం చేస్తుండగా పట్టుకున్నారు. వీరిద్దరూ గంజాయి, మద్యానికి అలవాటు పడ్డారు. దానికితోడు ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్లపై మోజుతో వాటిని కొనడానికి, జల్సాలకు దొంగతనాలు చేసేవారు. వీరు చేసే నేరాలకు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. శనివారం నాలుగో పట్టణ పోలీసులు జువైనల్ జస్టిస్ బోర్డు ఎదుట హాజరు పరిచి, అనంతరం జువైనల్ హోంకు తరలించారు.

ఆర్ఈఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడి నియామకం

ఎస్కేయూ: రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎండీ నాగభూషణం నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామచంద్ర శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన అన్నారు.

సకాలంలో కార్డుదారులకు నిత్యావసరాలు అందాలి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: కార్డుదారులకు సకాలంలో నిత్యావసర వస్తువులు అందేలా చర్యలు తీసుకోవాలని సంయుక్త కలెక్టర్ శివనారాయణశర్మ అధికారులను ఆదేశించారు. ఆయన శనివారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ.. నిత్యావసర వస్తువుల తూకంలో లోపం లేకుండా చూడాలన్నారు. ఐసీడీఎస్ స్టాక్‌ను ఎండీయూల ద్వారానే స్కూళ్లకు, అంగన్‌వాడీలకు పంపాలన్నారు. సీఎస్‌డీటీలకు వారి పరిధిలోని రేషన్ షాప్‌లను, ఎండీయూలను తనిఖీ చేయాలన్నారు. సరుకులు సక్రమంగా లబ్ధిదారులకు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు.

అనంతపురం

• అనంతపురం • రాప్తాడు



చిన్నంపల్లిలో కొత్తగా వేసిన బోరు వద్ద సర్పంచి శివశంకర్, కార్యదర్శి హిదయతుల్లా

తాగునీటి సమస్య పరిష్కారం

అనంతపురం (కళ్యాణదుర్గంరోడ్డు): అనంతపురం గ్రామీణం చిన్నంపల్లి పంచాయతీ కేంద్రంలో తాగునీటి సమస్యను పరిష్కరించారు. కొత్తగా బోరు, పైపులు, మోటరుకు రూ.3 లక్షలు వెచ్చించారు. శనివారం పంచాయతీ సర్పంచి శివశంకర్, కార్యదర్శి హిదయతుల్లా మోటర్‌ను పూజ చేసి ఆన్ చేశారు. బోరులో నీరు సమృద్ధిగా రావడంతో నీటి సమస్య తీరిందని గ్రామస్తులంతా సంతోషం వ్యక్తం చేశారు.

సాహిత్యంతో చైతన్యం నింపిన జాషువా



గుర్రం జాషువా విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎంపీ లక్ష్మీనారాయణ, సాహితీ వేత్తలు

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే: మహాకవి గుర్రం జాషువా తన సాహిత్యం ద్వారా సమ సమాజం నిర్మాణం చేయాలని పరితపించారని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కొనియాడారు. గుర్రం జాషువా సాహిత్య పీఠం ఆధ్వర్యంలో శనివారం అనంతపురం రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గంలో ఆర్ట్స్ కళాశాల సమీపంలో ఉన్న గుర్రం జాషువా జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళి అర్పించారు. ఎంపీ మాట్లాడుతూ ఆయన సాహిత్యంలో ప్రతిఘటన, ఆర్తి నిజాయతీ జాషువా కవిత్వంలో ప్రధానంగా కన్పిస్తాయన్నారు.

ఉక్కు నగరంలో మెరిసిన అనంత ఆణిముత్యం



ట్రోఫీలతో బి.శ్రేష్ఠ

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: విశాఖపట్టణంలో శనివారం రాత్రి ముగిసిన రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ పోటీల్లో బి.శ్రేష్ఠ రెండు విభాగాల్లో ట్రోఫీలు కైవసం చేసుకుంది. గీతం విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ చదువుతున్న ఆమె గతంలో అనేకమార్లు రాష్ట్ర ఛాంపియన్‌గా ఓ వెలుగు వెలిగింది. విశాఖ గీతం విశ్వవిద్యాలయంలో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి అనేక మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అనంతపురం నగరానికి చెందిన బి.శ్రేష్ఠ సీనియర్ విభాగంలో ద్వితీయ స్థానం, అండర్-19 విభాగంలో మూడో స్థానం సాధించి జిల్లా కీర్తిని ఇనుమడింపజేసింది. క్యాడెట్ విభాగం నుంచి సీనియర్ విభాగం వరకు పలు పర్యాయాలు ట్రోఫీలు అందుకుంది. స్పోర్ట్స్ కోటాలో బెంగళూరులోని గీతం విశ్వవిద్యాలయంలో రెండో సంవత్సరం ఇంజినీరింగ్ చదువుతున్న ఈమె టీటీలో కూడా పతకాలు సాధిస్తోంది. జిల్లా టీటీ సంఘం అధ్యక్షుడు పి.కేశవరెడ్డి, కార్యదర్శి ఎం.శ్రీనివాసరెడ్డి, పలువురు ఆమెను అభినందించారు.

చిట్టి బుర్రలు.. పెద్ద ఆలోచనలు

ఆకట్టుకున్న నమూనా ప్రదర్శన

ఎస్కేయూ, న్యూస్‌టుడే: చిట్టిబుర్రలకు పెద్ద ఆలోచనలు తట్టాయి. ఆ చిన్నారులు చదువుతున్నది కేవలం పాఠశాల విద్య మాత్రమే. కానీ ఇంజినీరింగ్ అభ్యసిస్తున్న విద్యార్థుల తరహాలో ఆలోచించారు. 7, 8, 9, 10వ తరగతి చదివే విద్యార్థులు నూతన ఆవిష్కరణల వైపు అడుగులు వేస్తున్నారు.

● నగరంలోని నంబర్-2 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో అటల్ టింకరింగ్ లాబ్ నిర్వహిస్తున్నారు. ఆ పాఠశాలలోని విద్యార్థులకు జేఎన్‌టీయూ అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల్లో సాంకేతిక విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు ప్రతి శనివారం శిక్షణ ఇచ్చారు. 12 శనివారాలు ఈ శిక్షణ కార్యక్రమం జరిగింది. శిక్షణ ముగింపు సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన నమూనా ప్రాజెక్టుల ప్రదర్శన ఏర్పాటు చేశారు.

● అటల్ టింకరింగ్ ప్రయోగశాలలో నూరుద్దీన్ అనే ఉపాధ్యాయుని పర్యవేక్షణలో నిర్వహించిన ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. సాంకేతిక విద్యపై విద్యార్థుల్లో అవగాహన కల్పించడం, పాఠశాల విద్య నుంచే నూతన ఆవిష్కరణల దిశగా విద్యార్థులను తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. శనివారం ఆ పాఠశాలలో విద్యార్థుల నమూనా ప్రాజెక్టులు ఎంతో ఆసక్తిని కలిగించాయి.

పాస్‌వర్డుతో తలుపులుకు తాళం



✦ **విద్యార్థుల పేర్లు:** పూజిత, అజయ్, అభిలాష్, అనంతపురం ✦ **ప్రాజెక్టు పేరు:** పాస్‌వర్డు డోర్‌లాక్ ✦ **అవసరమైన వస్తువులు:** ఆర్డినో యూనో బోర్డు, సర్వోమోటరు, ఎల్‌డీ డిస్‌ప్లే, జంపర్‌వైరు, డయిల్ ప్యాడ్, బ్యాటరీ ✦ **ఇలా పనిచేస్తుంది:** ఇంటి తలుపులకున్న గడికి సర్వో మోటరు అమర్చాలి. యూనోబోర్డు, ఎల్‌ఈడీ డిస్‌ప్లే, డయల్ ప్యాడ్‌లకు జంపర్ వైరుతో అనుసంధానం చేస్తారు. అవి బ్యాటరీ సహాయంతో పనిచేస్తాయి. ముందుగా సెట్ చేసిన నంబర్లు నొక్కితే డోర్ గడియ తెరుకుంటుంది. పొరపాటు నంబరు నొక్కితే డోర్ తెరుచుకోదు.

✦ **ఉపయోగం:** ఇంట్లో ఉన్న బీరువాలు, కప్‌బోర్డులు, ఇంటి తలుపులకు కూడా వీటిని అమర్చవచ్చు. సాధారణ తాళాలు వేయడం వల్ల దొంగతనాలు జరిగే అవకాశముంది. పాస్‌వర్డు విధానంతో నగలు, డబ్బులు వంటి విలువైన వస్తువులకు భద్రత ఎక్కువగా ఉంటుంది.

వీడియోగేమ్‌ల ఆవిష్కరణ



✦**విద్యార్థులపేర్లు:** ఆయేష, ఫిర్‌దౌస్, షాహినా ✦ **ప్రాజెక్టు పేరు:** మేజ్‌గేమ్స్ ✦ **అవసరమైన వస్తువులు:** ల్యాప్‌టాప్, అంతర్జాలం ✦ **ఆవిష్కరించిన అంశాలు:** విద్యార్థులు 3 కొత్త వీడియోగేమ్‌లు సృష్టించారు. అవి క్యాచ్‌ద ఫాలింగ్ ఫుడ్, క్యాట్ ఫ్లైయింగ్, మేజ్ గేమ్ ✦ **ఉపయోగం:** ఇవి పిల్లలు ఆడుకోడానికే అయినా వీటిని ప్లేస్టోర్‌లో అప్‌లోడ్ చేస్తే డబ్బులు సంపాదించవచ్చు. మరిన్ని పెద్ద వీడియోగేమ్‌లు సృష్టించడానికి ఆ విదార్థులు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

చెవిటి వారికి వాహనాల నుంచి రక్షణ



✦ **విద్యార్థుల పేర్లు:** ఫైజాన్, షాహీద్, సనా అర్షియా ✦ **ప్రాజెక్టు పేరు:** స్మార్ట్‌ఇండికేటర్ ఫర్ డఫ్అండ్‌డమ్ ✦ **అవసరమైనవి:** ద్విచక్రవాహనం, లైట్, బ్యాటరీ, స్విచ్ ✦ **పనిచేస్తుంది ఇలా:** ద్విచక్ర వాహనం క్లచ్ వద్ద స్విచ్ అమర్చాలి. వాహనం ముందు వైపు రంగుల లైటు ఏర్పాటు చేయాలి. వాహనం బ్యాటరీకి వైరుతో అనుసంధానం చేయాలి. చెవిటివారికి హారన్ వినిపించదు. స్విచ్ నొక్కినపుడు హారన్ మాత్రమే కాకుండా రంగుల బల్బు కూడా వెలుగుతుంది. చెవిటి వారు లైటు వెలిగితే వాహనం వస్తోందని గుర్తిస్తారు. ✦ **ఉపయోగం:** రోడ్డు ప్రమాదాలు తగ్గించవచ్చు.

సమస్య: ఆర్‌కేనగర్ మొదటి క్రాస్‌లో రెండో పోల్ జడ్2/12 లైటు వెలగడం లేదు. - సాయిప్రసాద్

సమాధానం: పరిశీలించి లైటు వెలిగే విధంగా చర్యలు చేపడతాం.

సమస్య: నగరంలోని 4,5వ రోడ్ల మధ్యలో పెద్దమ్మ గుడి ఆలయం వద్ద కుక్కలు ఎక్కువగా ఉన్నాయి. -మహేష్

సమాధానం: త్వరలోనే కుక్కలను తరలిస్తాం.

సమస్య: సాయినగర్ ఐదో క్రాస్‌లో మసీదు ముందు కాలువలు నిండిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. - రియాజ్

సమాధానం: వెంటనే పారిశుద్ధ్య సిబ్బందిని పంపి శుభ్రం చేయిస్తాం.

– పై ప్రశ్నలకు నగరపాలక డీఈ దాక్షాయిణి, ఎంహెచ్‌ఓ విష్ణుమూర్తి సమాధానాలు ఇచ్చారు. - న్యూస్‌టుడే, అనంత నగరపాలక

విశ్రాంత ఏఎస్సై ఇంట్లో చోరీ

అనంత నేరవార్తలు: అనంతపురం నగరం కళ్యాణదుర్గం రోడ్డు గణేశ్ నగర్‌లో విశ్రాంత ఏఎస్సై వీరాంజనేయులు ఇంట్లో చోరీ జరిగింది. బాధితుని కుటుంబం ఇటీవల శిర్డీకి వెళ్లింది. తిరిగి శనివారం ఇంటికి రాగా తాళాలు ధ్వంసమై ఉండటం గమనించారు. ఇంట్లో కెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. వాటిలో పరిశీలించగా రూ.98 వేలు విలువ చేసే 12 గ్రాముల బంగారం, ఉంగరం, గొలుసు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుడు అనంత గ్రామీణం పోలీస్‌స్టేషనులో ఫిర్యాదు చేశాడు.

భగత్‌సింగ్‌కు నివాళి

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహోన్నత వ్యక్తి భగత్ సింగ్ అని మేయర్ వసీం పేర్కొన్నారు. శనివారం భగత్ సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని నగరంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి నివాళి అర్పించారు.

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ఎస్కేయూలో ఏఐడీఎస్ఓ నాయకులు రాఘవేంద్ర, మహేష్‌బాబు, చరణ్ రాజ్, తేజ ఆర్ట్స్ కళాశాల విగ్రహం వద్ద ఉన్న భగత్‌సింగ్ విగ్రహానికి పుష్పాంజలి అర్పించారు.

వేరుసెనగ రైతులను ఆదుకోండి

రాప్తాడు, న్యూస్‌టుడే: సకాలంలో వర్షాలు కురవక వేరుసెనగ పంట సాగు చేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు, సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ పేర్కొన్నారు. శనివారం రాప్తాడు మండల కేంద్రంలోని వేరుసెనగ సాగుచేసి నష్టపోయిన రైతు పామళ్ల కుండప్ప పొలాన్ని పరిశీలించి పెట్టుబడి ఖర్చులు, నష్టం వివరాలపై అడిగి తెలుసుకున్నారు. వర్షాలు రాకపోవడంతో వేరుసెనగ సాగుచేసి ఎంతోమంది రైతులు నష్టపోయారని, రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. రాప్తాడు మండల సీపీఎం అధ్యక్షుడు పోతలయ్య, జిల్లా కమిటీ సభ్యుడు రామాంజనేయులు, కౌలు రైతు సంఘం అధ్యక్షుడు కదిరప్ప, రైతులు పాల్గొన్నారు.



వేరుసెనగ పంటను పరిశీలిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థులు ఎంపిక

ఆత్మకూరు,: మండలంలోని ముట్టాల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయినట్లు ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, పీడీ జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం విద్యార్థులను అభినందించారు. ఆర్ట్స్ కళాశాలలో జరిగిన అండర్-17 ఏపీ స్కూల్ గేమ్స్‌లో ప్రతాప్ రెడ్డి-ట్రిపుల్ జంప్‌లో ప్రథమ స్థానం, వెన్నెల-డిస్క్‌త్రో, వర్షిత-3కిలోమీటర్ నడకలో మూడవ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

విద్యుత్తు అధికారులు బాధ్యతల స్వీకరణ

అనంతపురం (వైద్యం): విద్యుత్తుశాఖ గుత్తి కన్‌స్ట్రక్షన్ సబ్ డివిజన్ డీఈఈగా రంగస్వామి బాధ్యతలు తీసుకున్నారు. ఈయన గుంతకల్లు డీఈఈగా పనిచేస్తూ బదిలీ అయ్యారు. అనంతపురం టౌన్-1 సబ్ డివిజన్ డీఈఈగా చంద్రశేఖర్ బాధ్యతలు తీసుకున్నారు.





ఇదేం సుందరీకరణ!



రోడ్డు వేశారు. విభాగిని ఏర్పాటు చేశారు. విభాగిని నిండా చెట్లు నాటేందుకు ఎర్రమట్టితో నింపింది పిచ్చి మొక్కలు, ముళ్ల కంప చెట్లు పెరిగేందుకా? అని నగర ప్రజలు చర్చించుకుంటున్నారు. జేఎన్‌టీయూకు వెళ్లే మార్గంలో విభాగినులు అంధవిహీనంగా కన్పిస్తున్నాయి. వైకాపా హయాంలోనే మూడేళ్ల క్రితం తారు రోడ్డు వేయగా రెండేళ్ల క్రితం విభాగినుల ఏర్పాటుతోపాటు సుందరీకరణ కోసం మట్టితో నింపారు. మొక్కలు నాటకుండా వదిలేశారు. - న్యూస్‌టుడే, శారదానగర్

ఆగిన భవన నిర్మాణం



రుద్రంపేట పంచాయతీ పరిధిలోని విమలాషారూఖ్ నగర్‌లో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణ దశలో ఆగిపోయింది. ఏళ్లు గడుస్తున్నా భవనం నిర్మాణం పనులు చేపట్టడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని అంగన్‌వాడీ భవన నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఝాన్సీ మాట్లాడుతూ అంగన్‌వాడీ భవనం నిర్మాణం ఆక్రమించారని పక్కన నివాసం ఉంటున్న వాళ్లు కోర్టుకు వెళ్లడంతో భవన నిర్మాణం ఆగింది. కోర్టు ద్వారా సమస్య పరిష్కారం కాగానే భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకొంటామని తెలిపారు. - న్యూస్‌టుడే, రుద్రంపేట

శివారు.. మురుగుతో బేజారు



రుద్రంపేట పంచాయతీ శివారుల కాలనీలు మురుగునీటి కూపాలుగా మారుతున్నాయి. చైతన్య కాలనీ ఏర్పడి ఏళ్లు గడచినా కనీసం మట్టి రోడ్లు ఏర్పాటుకు నోచుకోలేదు. కాలనీలో మౌలిక సదుపాయాలకు నోచుకోక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపారు. ఇళ్ల పక్కనే చెరువు తలపించే విధంగా మురుగు నీరు నిలువ ఉంటున్నందున దోమల వ్యాప్తి పెరిగి జబ్బుల బారిన పడుతున్నామని మహిళలు చెబుతున్నారు. ప్రధాన రహదారి మురుగునీటిలో కలసిపోవడంతో దాటుకునేందుకు చిన్న చిన్న బండరాళ్లు ఏర్పాటు చేసుకొని రాకపోకలు సాగిస్తున్నామంటూ తమ గోడు వెళ్ల బోసుకొంటున్నారు. - న్యూస్‌టుడే, రుద్రంపేట

స్వాగతోత్సవ సందడి



భావి ఇంజినీర్ల నృత్యం

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: విద్యార్థులు వికసించే పుష్పాల వంటివారని సీనియర్లు, జూనియర్లు అనే తారతమ్యం లేకుండా కలసి మెలసి చదువుకోవాలని జేఎన్‌టీయూ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య సుదర్శనరావు పేర్కొన్నారు. జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో అన్ని విభాగాలు కలిపి స్వాగతోత్సవం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సుదర్శనరావు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన ప్రసంగిస్తూ ఇంజినీరింగ్ చదివే విద్యార్థులు ఎప్పటికప్పుడు నూతన విషయాలపై పరిశోధనలు చేస్తూ విజ్ఞానం పెంచుకోవాలన్నారు. భావి ఇంజినీర్లు సినిమా పాటలకు స్టెప్పులేస్తూ సందడి చేశారు.

వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా శనివారం జనసేన ఆధ్వర్యంలో నగరంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భవానీ రవికుమార్, మహిళా కమిటీ సమన్వయకర్త పెండ్యాల శ్రీలత, లీగల్ సెల్ అధ్యక్షుడు మురళీకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు జయరామిరెడ్డి, ఈశ్వరయ్య, పత్తి చంద్రశేఖర్, నాగేంద్ర ఈ పూజల్లో పాల్గొన్నారు. ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆలయ రుత్వికులు సుదర్శన హోమం, నవగ్రహ హోమం, నారాయణ, ప్రాయశ్చిత హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వరుణ్ మాట్లాడుతూ.. శ్రీవారి లడ్డూ ప్రసాదానికి వాడే నెయ్యి కల్తీ కావడాన్ని ముందుగానే గుర్తించలేకపోయినందుకు అధినేత దీక్ష చేపట్టినట్లు తెలిపారు.



హోమం వద్ద టీసీ వరుణ్, పెండ్యాల శ్రీలత

ముగిసిన నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలు



జిల్లా క్రీడలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

రాప్తాడు, న్యూస్‌టుడే: రాప్తాడు మండల కేంద్రంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలు శనివారం విజయవంతంగా ముగిశాయి. రాప్తాడు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు అనంతపురం రూరల్, ఆత్మకూరు, రాప్తాడు మండలాల నుంచి 350 మంది పాల్గొన్నారు. అండర్-14 బాలుర, బాలికల విభాగం ఖోఖోలో రాప్తాడు ప్రథమ స్థానం, అండర్-17 బాలురు, బాలికల విభాగంలో రాప్తాడు ప్రథమ స్థానంలో నిలిచింది. అండర్-14 బాలురు విభాగం వాలీబాల్‌లో అనంతపురం రూరల్ ప్రథమ స్థానం, బాలికల విభాగంలో రాప్తాడు ప్రథమ స్థానం, అండర్-17 బాలురు, బాలికల విభాగం వాలీబాల్‌లో రాప్తాడు ప్రథమ స్థానం, అండర్-14 కబడ్డీ బాలుర, బాలికల విభాగం, అండర్-17 కబడ్డీ బాలురు, బాలికల విభాగం రెండింటిలోనూ ఆత్మకూరు ప్రథమస్థానంలో నిలిచారు. అండర్-17 కబడ్డీ బాలుర విభాగంలో ఆత్మకూరు ప్రథమ స్థానం, బాలికల విభాగంలో రాప్తాడు ప్రథమ స్థానంలో నిలిచారు.

'దళితులను అవమానిస్తే సహించం'

అనంతపురం(కళ్యాణదుర్గంరోడ్డు): దళితులను రెచ్చగొట్టి, అవమాన పరిచే వ్యాఖ్యలు చేస్తే సహించేదేలేదని శ్రీసత్యసాయి జిల్లా మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు హెచ్చరించారు. దళితుల దేవాలయాల ప్రవేశాలపై మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన ఘాటుగా స్పందించారు. శనివారం అనంతపురం రహదారులు, భవనాలశాఖ విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే ఎంఎస్.రాజు మాట్లాడుతూ జగన్ తిరుమల పర్యటన రద్దుచేసుకుని దళితులపై రుద్దడంపై మండిపడ్డారు. దేవుడుపై విశ్వాసం లేని వ్యక్తివి నీవు. డిక్లరేషన్ ఇచ్చేందుకు నీకిష్టంలేదు. ఓట్ల కోసమే క్రైస్తవ మతాన్ని అడ్డంపెట్టుకున్నారని ధ్వజమెత్తారు. కులాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తే.. ప్రజల నుంచి దూరం కావాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

